మంగళవారం
SATURDAY
24.12.2024
సంచిక: 122
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

కోపమే అన్ని అనర్థాలకు మూలవ.
నరకానికి ఉండే ప్రధాన మూడు
ద్వారాలలో కోపము ఒకటి.
మిగిలిన రెండు మోహం, ఆశ.
కోపంలో ఉన్న వ్యక్తి
ఆలోచనారహితుడవుతాడు.
అప్పుడు విచక్షణ జ్ఞానాన్ని
కోల్పోయి పశువులా
ప్రవర్తిస్తాడు.

ముహూర్తం

మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం ఉ. 6:46 సూర్యాస్తమయం - సా. 5:44 తిథిజి నవమి రా. 7:51 వరకు సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం హస్త మ. 12:11 వరకు యోగం శోభన రా. 8:50 వరకు కరణం గరజి రా. 7:51 వరకు వనిజ ఉ. 9:130 వరకు వర్జ్యం రా. 9:18 నుండి రా. 11:07 వరకు దుర్ముహూర్తం ఉ. 8:58 నుండి ఉ. 9:42 వరకు రా. 10:57 నుండి రా. 11:49 వరకు రాహుకాలం మ. 3:00 నుండి సా. 4:22 వరకు యమగండం ఉ. 9:31 నుండి ఉ. 10:53 వరకు గుళికాకాలం మ. 12:15 నుండి మ. 1:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:10 నుండి తె. 5:58 వరకు అమృత ఘడియలు లేదుజి అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:37 వరకు
గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

యువతులు వీరనారీలుగా మారాలి

కుటుంబ విలువలను పరిరక్షించాలి

దుర్గావాహిని సభలో వక్తల సందేశం

2

మతమార్పిడి కేంద్రాలుగా టీజీఆర్జేసీ కాలేజీలు

వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల

మాఫియాపై చర్యలు తీసుకోవాలని టీజీఆర్జేసీ సెక్రటరీకి ఫిర్యాదు

2

71,000

ఏడాదిన్నరలో 10 లక్షల ఉద్యోగాల కల్పన

దేశ చరిత్రలోనే ఇదో అతిపెద్ద రికార్డు

మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

నియామక పత్రాలు అందజేసిన మోదీ

భారత దేశాభివృద్ధిలో యువతే కీలకం

యువతకు ప్రధాని మోదీ అభినందనలు

వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పత్రాల అందజేత

భారతదేశ యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని.. వారిలోని సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వం మరింత ముందుకువెళ్తుంది. ఇలా ఉద్యోగాలు పొందినవారంతా భక్తితో, నిజాయతీతో దేశం కోసం పని చేస్తున్నారు. ఇలాగే ముందుకుసాగితే 2047 కల్లా వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోగలం. -ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): తమ పాలనలో యువతకు పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత ఒకటిన్నర ఏళ్లలో 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. దేశ చరిత్రలో ఇది పెద్ద రికార్డ్ అని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ పక్రియలో నిజాయతీ, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నేడు జరుగుతున్న రోజ్‌గార్ మేళాలోనూ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కొత్తగా నియామకమైన 71,000 మందికి పైగా యువతకు అపాయింట్ మెంట్ లెటర్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కొత్తగా నియమితులైన వారిని అభినందించారు. భారతదేశ యువతతో మాట్లాండేందుకు తాను కువైట్ నుంచి రాత్రి భారత్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత దేశంలోని యువతతో తన మొదటి కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాలకు

తరువాయి 2 వ పేజీలో...

చిత్రసీమ దిగ్గజం బెనగల్ కన్నుమూత

శ్యామ్ బెనగల్‌గా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ వాసి

2

మేడిగడ్డ అవినీతి కేసులో

కెసిఆర్, హరీశ్ క్వాష్ పిటిషన్లు

2

అంగరంగవైభవంగా పీవీ సింధు పెళ్లి

ఉదయపూర్ వేదికగా ఒక్కటైన జంట

నేడు హైదరాబాద్‌లో వివాహ విందు

సీఎం రేవంత్‌తో సినీ ప్రముఖుల భేటీ!

తాజా పరిణామాల నేపథ్యంలో పలు అంశాలపై చర్చ

అమెరికా నుంచి దిల్‌రాజు వచ్చాక భేటీ ఖరారు.. నిర్మాత నాగవంశీ వెల్లడి

హైదరాబాద్,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): సంధ్య థియేటర్ ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసే ఆలోచనలో తెలుగు సినీ ప్రముఖులు ఉన్నట్లు నిర్మాత నాగవంశీ తెలిపారు. రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' మూవీ ప్రచారంలో భాగంగా అమెరికాలో ఉన్న నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక సీఎంను కలుస్తామని చెప్పారు. టికెట్ ధరల పెంపు, ప్రీమియర్ షోలపై చర్చిస్తామని నాగవంశీ తెలిపారు. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకు మహారాజ్' సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగవంశీ ఈ మూవీని నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం చిత్ర దర్శకుడు బాబీ, నిర్మాత నాగవంశీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం తెలుగు చిత్ర

తరువాయి 2 వ పేజీలో...

మోహన్‌బాబుకు చుక్కెదురు

ముందస్తు బెయిల్ నిరాకరించిన హైకోర్టు

3



అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసులు

నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం

రేవతి కుటుంబానికి మైత్రీ ఆర్థికసాయం

కోలుకుంటున్న బాలుడు శ్రీతేజ్

అల్లుఅర్జున్ ఇంటి దాడిలో కేసులో నిందితులకు బెయిల్

హైదరాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): సినీనటుడు అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై

తరువాయి 2 వ పేజీలో...

శ్రీశైలంలో అన్యమత ప్రచారం నిషేధం

అన్యమత కార్యక్రమాలకు సహకరించినా శిక్షార్హమే

దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ

నంద్యాల,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటి మాత్రమే కాదు అష్టాదశ అమ్మవారి ఆలయాల్లో ఒకటి అయిన శ్రీశైలం మహాక్షేత్రంలో ఇకపై అన్యమత ప్రచారం చేయకుండా ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీగిరి క్షేత్రంలో వెలసిన శివయ్య ఇక్కడ మల్లికార్జునుడుగా అమ్మవారు భ్రమరాంబగా భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఆదిదంపతుల దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల్లోమాత్రమే కాదు దేశంలో అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తాయి. తాజాగా శ్రీశైలం మహా క్షేత్రంలో దేవాదాయ శాఖ సరికొత్త నిబంధనలను తీసుకొచ్చి,. సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధనలను అనుసరించి శ్రీశైలక్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం, అన్యమతాలకు సంబంధించిన కార్యకలాపాలు, అన్యమతచిహ్నాలు ప్రదర్శించడం పూర్తిగా నిషేధం విధించారు. ఈ విషయాన్ని శ్రీశైల

తరువాయి 2 వ పేజీలో...

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా,
rhushinews@gmail.com
మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

71,000 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి

హృదయ పూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భారతదేశ యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ప్రధాని ఉద్ఘాటించారు. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని.. వారిలోని సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వం మరింత ముందుకువెళ్తుందని అన్నారు. ఇలా ఉద్యోగాలు పొందినవారంతా భక్తితో, నిజాయతీతో దేశం కోసం పని చేస్తున్నారని.. ఇలాగే ముందుకుసాగితే 2047 కల్లా వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి యువత పైనే ఆధారపడి ఉంటుందని.. అయితే గత ప్రభుత్వాలు వారికి సరైన ఉపాధి కల్పించకపోవడం వల్ల దేశం వెనకబడిపోయిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. అందుకనుగుణంగా మేక్‌ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం భారత్ అన్నిరంగాల్లో ముందుకువెళ్తుందని.. అంతరిక్షం, రక్షణ, మొబైల్ తయారీ, పునరుత్పాదక ఇంధనం, పర్యటక రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళాలో అందించిన నియామక పత్రాల్లో అధిక సంఖ్యలో యువతులు ఉన్నారని మోదీ పేర్కొన్నారు. మహిళలు అన్నిరంగాల్లో స్వయంప్రతిపత్తిని సాధించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అన్ని ప్రాంతాల యువతకు అనుకూలంగా ఉండేందుకు 13 భారతీయ భాషల్లో రిక్రూట్‌మెంట్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వెల్లడించారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఈ దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ ప్రస్తావించారు. గత 10 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలనే ప్రచారం జరుగుతోందన్నారు. నేటికీ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. గత ఏడాదిన్నర కాలంలో మా ప్రభుత్వం దాదాపు 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను శాశ్వతంగా కల్పించిందని మోదీ పేర్కొన్నారు. ఇది స్వతహాగా భారీ రికార్డు అని ప్రధాని అన్నారు. ఈ విధానంలో యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి చొరవ జరగలేదని, నేడు దేశంలో లక్షలాది మంది యువత ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే యువత బలం, నాయకత్వం నుంచే పుడుతుందని ప్రధాని అభిప్రాయం వ్యక్తం చేశారు. పారదర్శకమైన సంప్రదాయం నుంచి వస్తున్న యువత పూర్తి భక్తి, నిజాయితీలతో దేశ సేవలో నిమగ్నమై ఉన్నందుకు సంతోషిస్తున్నట్లు ప్రధాని అన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దాలన్నది మా సంకల్పమన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో పూర్తి విశ్వాసం ఉందన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక విధానాలను తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్వావలంబన భారత్ ప్రచారం, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా ఇలా ప్రతి స్కీమ్ యువతను కేంద్రంగా చేసుకుని రూపొందించినట్లు వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ తన విధానాలను మార్చుకుంది. భారతదేశం తన రక్షణ రంగంలో తయారీని ప్రోత్సహించింది. దీనిలో యువత ఎక్కువగా లాభపడింది. నేడు భారతదేశ యువత కొత్త విశ్వాసంతో నిండి ఉంది. ప్రతి రంగంలోనూ యువత విజయపతాకం రెపరెపలాడుతోంది. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అవతరించామని ప్రధాని గుర్తు చేశారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థగా ఉంది. ఈ క్రమంలో ఒక యువకుడు తన సొంత స్టార్టప్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకున్నప్పుడు, వారు పూర్తి పర్యావరణ వ్యవస్థను పొందుతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నేడు దేశంలోని వేలాది మంది యువత జీవితాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఈ రోజు ఇచ్చిన 71,000 ఉద్యోగాల్లో 29 శాతానికి పైగా ఓబీసీలు, 15.8 శాతం షెడ్యూల్ కులాలు, 9.6శాతం షెడ్యూల్ తెగలు ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే ఎన్డీఏ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనకబడిన తరగతుల రిక్రూట్‌మెంట్ 27శాతం పెరిగిందని చెప్పారు.

పారదర్శకంగా ఉద్యోగనియామకాలు: కిషన్‌రెడ్డి

అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చాంద్రాయణగుట్ట సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 526 మందికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. దేశ వ్యాప్తంగా 71 వేల మందికి నేడు నియామక పత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దళారుల మాట విని మోసపోవద్దని ఉద్యోగార్థులకు సూచించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 10 రోజ్ గార్ మేళాలు పూర్తి అయ్యాయని, ఇది 11 వ మేళా అని ఆయన అన్నారు. ఈ రోజుతో కలుపుకొని సుమారుగా పది లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నా. ప్రతి నెల ఉద్యోగ నియామకాలు జరగాలి, ఖాళీలు ఉండొద్దు అని ప్రధాని ఆదేశాలు ఇచ్చారన్నారు. అందుకే రెగ్యులర్ గా నియామకాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. గతంలో ఉద్యోగ నియామకాల్లో అవినీతి జరిగేది.. ఇప్పుడు పూర్తిగా పారదర్శకంగా నియామకాలు జరుగుతున్నాయని, నా మంత్రిత్వ శాఖలో మొత్తం రెగ్యులర్ కాంట్రాక్టు ఇతర కలిపి 8 లక్షల ఉద్యోగులు ఉంటారు. ఖాళీలను వెంటనే భర్తీ చేస్తున్నామన్నారు. కరోనాతో ఎన్నో దేశాలు ఆర్థికంగా అతలాకుతలం అయ్యాయని, మన దేశంలో తయారు అవుతున్న మొబైల్ ఫోన్‌లను అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి అవుతున్నాయని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మన దేశంలో 5జి సేవలు అందుతున్నాయి. చాలా దేశాల్లో 5జి లేదని ఆయన అన్నారు. అతి తక్కువ ఛార్జ్ తో నెట్ సేవలు అందిస్తున్న దేశం మన దేశం అని, దేశం లో జఖఎ/డిజిటల్ ట్రాన్సాక్షన్స్ పెరిగాయన్నారు. డిఫెన్స్ పరికరాలు ఎగుమతి చేస్తున్నామన్నారు. మన దేశ యువత అతి తొందరలోనే ప్రపంచాన్ని శాసిస్తుందన్నారు కిషన్ రెడ్డి. మన తల్లి దండ్రులను, మన గ్రామాన్ని, మన మాతృ దేశాన్ని, మన గురువులను ఎప్పటికీ మరవకూడదన్నారు. అభివృద్ధి, సంక్షేమం అందరికీ చేరాలన్నదే తమ ఆకాంక్ష అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హకీంపేట్‌లోని నిసా కేంద్రంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 340 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 8.50 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. కేంద్ర ఉద్యోగాల్లో అన్ని శాఖల ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువతులు వీరనారీలుగా మారాలి

కుటుంబ విలువలను పరిరక్షించాలి

దుర్గావాహిని సభలో వక్తల సందేశం

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఋషి ప్రతినిధి): నేటి తరం యువతులు చదువు, ఉద్యోగాలతో పాటు నాటి వీర వనితల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత రెడ్డి అన్నారు. యువతులు సున్నితత్వంతో పాటు శూరత్వం కలిగి ఉండాలని సూచించారు. ఆదివారం అష్టలక్ష్మి దేవాలయం సమీపంలో విశ్వహిందూ పరిషత్ యువతి విభాగం దుర్గా వాహిని సమావేశం నిర్వహించారు. అంతకుముందు అష్టలక్ష్మి దేవాలయం పరిసర ప్రాంతం మొదలుకొని చైతన్యపురి, కొత్తపేట, విక్టోరియా మెమోరియల్ మెట్రో రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో ప్రధాన రహదారి వెంబడి 1500 మంది దుర్గా వాహిని యువతులు ర్యాలీ నిర్వహించారు. కాషాయ జెండాలు చేతబట్టి సాగిన ర్యాలీ.. జైశ్రీరామ్ నినాదాలతో దద్దరిల్లింది. దాదాపు 100 మంది చిన్నారులు భరతమాత తో పాటు నాటి వీర మాతల వేషాధారణతో అలరించారు. ప్రధాన దారి వెంట సాగిన ర్యాలీ.. ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో రోడ్డు వెంబడి ప్రజలు చూస్తూ నిలబడిపోయారు.అనంతరం అష్టలక్ష్మి దేవాలయ ప్రాంగణంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభ ప్రాంగణంలో యువతులు శక్తి ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు. ముందుగా భరతమాత, రాణి దుర్గావతి, అహల్యాబాయ్ హోల్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజా చేశారు. దుర్గా వాహిని రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కు భాయి సభా అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా డాక్టర్ శిరీష , ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ శిల్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత రెడ్డి మాట్లాడుతూ.. నేటి యువతులు ఆధునికత పేరుతో అస్తవ్యస్తమైన జీవన విధానాన్ని అవలంబించడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశము , ధర్మము, సమాజం పట్ల బాధ్యత కలిగి జీవించాలని సూచించారు. చదువుతోపాటు విలువలతో కూడిన వ్యక్తిత్వం నేటి యువతరానికి ప్రాథమిక అవసరంగా గుర్తించాలని పేర్కొన్నారు. దుర్గా వాహిని రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి మాట్లాడుతూ.. మాతృ వందన కార్యక్రమం పేరుతో నాటి వీర వనితల స్ఫూర్తిని స్మరించుకుంటామన్నారు. నిత్యజీవితంలో సైతం ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా తమను తాము కాపాడుకోవాలని ఆత్మవిశ్వాసం బోధించారు. శారీరక , మానసిక, నైతిక వికాసం తో కూడిన యువతులు తయారు కావాలన్నారు. ఆత్మరక్షణ కోసం విద్యలు నేర్చుకొని తమను తాము కాపాడుకోవాలని సూచించారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. యువతులు ఆరోగ్య విషయాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎంతటి చదువు ఉన్నప్పటికీ కుటుంబ విలువలు మరువకూడదని వివరించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు భోజన పల్లి నరసింహమూర్తి, లక్ష్మీనారాయణ, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి శశిధర్, మాతృ శక్తి రాష్ట్ర కన్వీనర్ పద్మశ్రీ, దుర్గా వాహిని నాయకులు సింధుజ, మాధవి, ఉమారాణి, శిరీష, నిఖిల, సంకల్ప, భవాని, మీనా, లతశ్రీ , జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారని విశ్వహిందూ ప్రచార ప్రముక్ పగుడాకుల బాలస్వామి పేర్కొన్నారు.

మతమార్పిడి కేంద్రాలుగా టీజీఆర్జేసీ కాలేజీలు

వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఋషి ప్రతినిధి): తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల కేంద్రంగా నడుస్తున్న క్రైస్తవ మతమార్పిడి మాఫియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతన శశిధర్ అన్నారు. ఈ మేరకు సోమవారం టీజీఆర్జేసీ సెక్రటరీ రమణ కుమార్‌ను కలిసి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. హనుమకొండ జిల్లా పరిధిలోని హసన్‌పర్తి కళాశాలలో ప్రిన్సిపల్ ఇందుమతి మతమార్పిడి మాఫియాను కొనసాగిస్తున్నారని, విద్యార్థినులను వేధింపులకు, ప్రలోభాలకు గురిచేసి మతం మారుస్తున్నారని ఆరోపించారు. బాలికల రెసిడెన్షియల్ కళాశాలలోకి బయటి నుండి క్రైస్తవ ఫాదర్లను రప్పించి మతమార్పిడి జరిపిస్తున్నారని, 21 సంవత్సరాలుగా ఒకే దగ్గర తిష్ఠవేసిన ప్రిన్సిపల్ ఇందుమతి వ్యవస్థలన్నింటినీ తనకు అనుకూలంగా మలచుకొని హసన్‌పర్తి బాలికల రెసిడెన్షియల్ కళాశాలను చర్చిగా మార్చారని, మతం మారడానికి ఇష్టపడని విద్యార్థినులపై వేధింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఆ వేధింపులు భరించలేక అనేకమంది విద్యార్థినులు తమ చదువులు మధ్యలోనే వదులుకుంటున్నారని, పిన్సిపల్ భౌతిక వేధింపుల కారణంగా విద్యార్థినులు తీవ్ర భయంలో ఉన్నారని కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. ఫిర్యాదుకు సంబంధించిన వీడియోలు, ఫోటోల సాక్ష్యాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి టీజీఆర్జేసీ కేంద్రంగా సాగుతున్న మతమార్పిడులు అరికట్టాలని, ప్రభుత్వం చర్యలు చేపట్టడంలో విఫలమైతే వీహెచ్‌పీ ప్రత్యక్ష కార్యచరణకు సిద్ధమవుతుందని స్పష్టంచేశారు.

అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసులు

మొదటి పేజీ తరువాయి

ప్రశ్నించనున్నారు. 'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద విషాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనికి సంబంధించి 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో అల్లు అర్జున్ 11వ నిందితుడిగా ఉన్నారు. డిసెంబరు 13న ఆయన్ను అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్ విధించింది. అనంతరం రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో అల్లు అర్జున్‌కు మరోసారి నోటీసులు జారీ చేసిన పోలీసులు.. తొక్కిసలాట ఘటనపై మరింత లోతుగా విచారించే అవకాశముంది.

రేవతి కుటుంబానికి మైత్రీ మూవీ మేకర్స్ 50 లక్షల చెక్కు

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబానికి 'పుష్ప' చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఆర్థికసాయం అందించింది. మైత్రీ మూవీస్ సంస్థ నిర్మాత నవీన్ సోమవారం రూ.50లక్షల చెక్కును మృతురాలి కుటుంబానికి అందించారు. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేవతి భర్తను పరామర్శించి చెక్కును అందించారు. 'తొక్కిసలాట ఘటనలో రేవతి చనిపోవడం చాలా బాధాకరం. వారి కుటుంబానికి తీరనిలోటు. ప్రస్తుతం బాబు శ్రీతేజ్ కోలుకుంటున్నాడు. బాధిత కుటుంబానికి మా వంతు సాయం చేయడానికి ఇక్కడకు వచ్చాం. వారి కుటుంబానికి ఎప్పటికీ అండగా నిలబడతాం' అని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్‌లు తెలిపారు.

కోలుకుంటున్న బాలుడు శ్రీతేజ్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి.. దాదాపు మూడు వారాలుగా కోమాలో ఉన్న శ్రీతేజ్ హెల్త్ బులిటెన్‌ను కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం విడుదల చేసింది. ప్రస్తుతం శ్రీ తేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, వెంటిలేటర్ లేకుండానే శ్వాస తీసుకుంటున్నాడని ఈ హెల్త్ బులిటెన్‌లో డాక్టర్స్ తెలిపారు. ఆదివారం కంటే సోమవారం అతని ఆరోగ్యం మెరుగైందని, కాకపోతే.. జ్వరం పెరుగుతోందన్నారు. అలాగే వైట్ బ్లడ్ సెల్స్, మిగితా సెల్స్ అన్ని ఇప్పుడిప్పుడే ఇంప్రూవ్ అవుతున్నాయి అని చెప్పారు. ఫుడ్ తీసుకోగలుగుతున్నాడని వెల్లడించారు.

శ్రీశైలంలో అన్యమత ప్రచారం నిషేధం

మొదటి పేజీ తరువాయి

దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలం ఈఓ మాట్లాడుతూ అన్యమత సూక్తులను, చిహ్నాలను, భోదనలను, అన్యమతానికి సంబంధించిన ఫోటోలు కలిగిఉన్న వాహనాలు కూడా క్షేత్ర పరిధిలోకి అనుమతించబడవని పేర్కొన్నారు. శ్రీశైల క్షేత్ర పరిధిలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ అన్యమత ప్రచారాలకు, అన్యమత కార్యక్రమాలకు సహకరించడం కూడా చట్టం ప్రకారం శిక్షార్హమే అని అన్నారు. కనుక ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలు పాటించాలని సూచించారు. అయితే నిబంధనలు ఉల్లంఘించిన విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకొనబడతాయని ఈఓ హెచ్చరించారు.

చిత్రసీమ దిగ్గజం బెనగల్ కన్నుమూత

శ్యామ్ బెనగల్‌గా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ వాసి

ముంబై,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): భారతీయ సినీ పరిశ్రమ మరో దిగ్గజాన్ని కోల్పోయింది. తెలంగాణ ఆత్మని తెరపై ఆవిష్కరించిన అతికొద్ది గొప్ప దైరెక్టర్లలో ఒకరైన శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం మృతి చెందారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. అంకుర్, భూమిక, నిషాంత్, కలుగ్, మంతన్ సహా ఎన్నో సినిమాలను తెరకెక్కించారు. 1934లో డిసెంబర్ 14న హైదరాబాదు తిరుమలగిరిలో జన్మించిన ఆయనను పద్మశ్రీ, పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే సహా పలు అవార్డులు వరించాయి. శ్యామ్ బెనెగల్‌గా ప్రఖ్యాతిగాంచిన బెనగళ్ల శ్యామ్‌సుందరరావు హైదరాబాద్‌లోని తిరుమలగిరిలో 1934 డిసెంబర్ 14న జన్మించారు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎం.ఎ. ఎకనామిక్స్‌లో పట్టా పొందారు. 1959లో ముంబయి కేంద్రంగా ఉన్న ఓ యాడ్ ఏజెన్సీలో కాపీరైటర్‌గా పనిచేశారు. మరో సంస్థలో క్రియేటివ్ హెడ్‌గా కొనసాగారు. 1962లో తొలి గుజరాతీ డాక్యుమెంటరీ రూపొందించారు. దశాబ్దం తర్వాత ఫీచర్ ఫిల్మ్‌ను ఆయన తెరకెక్కించారు. అనంత్ నాగ్, షబానా అజ్మీ ప్రధాన పాత్రలో రూపొందిన ఆ చిత్రమే 'అంకుర్'. సెకండ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో జాతీయ అవార్డు అందుకుంది. 'నిషాంత్', 'మంథన్', 'భూమిక', 'సమర్', 'హరి- భరీ', 'మండి'.. ఇలా బెనెగల్ దర్శకత్వం వహించిన దాదాపు అన్ని సినిమాలు అవార్డు దక్కించుకోవడం విశేషం. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన చివరి చిత్రం 'ముజిబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్' గతేడాది విడుదలైంది. పలు లఘు చిత్రాలు, ధారా వాహికలకూ బెనెగల్ దర్శకత్వం వహించి తనదైన ముద్ర వేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, ఏఎన్ఆర్ వంటి అనేక జాతీయ అవార్డులు అందుకున్నారు. ఈ లెజెండరీ దర్శకుడి మరణం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు ప్రముఖులు, అభిమానులు సంతాపాలు తెలిపారు. బెనగల్ మృతికి ప్రధాని మోడీ సహా ప్రముఖులు సంతాపం తెలిపారు.

మేడిగడ్డ అవినీతి కేసులో కెసిఆర్, హరీశ్ క్వాష్ పిటిషన్లు

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఋషి ప్రతినిధి):తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందన్న అంశంపై భూపాలపల్లి కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలని కోరారు. మేడిగడ్డ నిర్మాణంలో ప్రమాణాలు పాటించలేదని, దీనివల్ల ప్రజాధనం వృథా అయ్యిందని రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి జిల్లా కోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జిల్లా న్యాయస్థానం జులై 10న కేసీఆర్, హరీశ్‌రావు సహా ఆరుగురికి నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు తాజాగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టనుంది.

అంగరంగవైభవంగా పీవీ సింధు పెళ్లి

ఉదయపూర్ వేదికగా ఒక్కటైన జంట.. నేడు హైదరాబాద్‌లో వివాహ విందు

హైదరాబాద్,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌కు చెందిన 29 ఏళ్ల వెంకట దత్త సాయితో సింధు వివాహం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాజస్థాన్ ఉదయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, పలువురు ప్రముఖులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఇవి చూసిన అభిమానులు సింధు జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేశారు. కాగా, సింధు పెళ్లి చేసుకున్న వెంకట దత్త సాయి.. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి పీవీ రమణ స్వయంగా వెల్లడించిన విషయం తెలిసిందే.

సీఎం రేవంత్‌తో సినీ ప్రముఖుల భేటీ!

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సీఎంను కలిసే యోచనలో ఉన్నట్లు తెలిపారు. సంధ్య థియేటర్ ఘటన తర్వాత ఈ మూవీ విషయంలో ఏమైనా జాగ్రత్తలు తీసుకుంటున్నారా? అని అడగ్గా.. 'ఆ నిమిషంలో జరిగే దాన్ని ఎవరూ ఆపలేరు. ఈసారి నుంచి ఇంకాస్త జాగ్రత్తలు తీసుకుంటాం. ఒక సినిమా ఎన్నో థియేటర్‌లలో రిలీజ్ అవుతుంది. ప్రతిచోటా మేం ఫాలోఅప్ చేయలేం కదా.. ఒక వేళ అలా ఫాలోఅప్ చేస్తామని చెప్పినా అది నమ్మశక్యంగా ఉంటుందా? మా పరిధిలో ఉన్నంతవరకూ తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. ఇటీవల జరిగిన ఘటనలు మరోసారి జరగకుండా చూసుకోవడానికి ప్రయత్నిస్తాం' అని సమాధానమిచ్చారు. అలాగే, ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్‌కు షిఫ్ట్ అవుతుందని టాక్ వినిపిస్తోంది కదా? దానిపై మీ సమాధానం ఏంటి అని అడగ్గా, 'నేను చాలా డబ్బులు పెట్టి హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకున్నా. మరో ప్రాంతానికి ఎందుకు వెళ్తాను. ఇండస్ట్రీక్రి ఏపీ ప్రభుత్వం నుంచి ఎప్పుడూ సపోర్ట్ ఉంటుందని పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి చెబుతూనే ఉన్నారు. అప్పటినుంచి రిలీజ్ అయిన సినిమాలకు కూడా సపోర్ట్ ఇస్తూనే ఉన్నారు' అని అన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన.. దాని తదనంతర పరిణామాలు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో కొత్త సినిమాలకు టికెట్ రేట్లు పెంచేది లేదని, బెనిఫిట్ షోలకూ అనుమతి ఇవ్వమని తెలంగాణ సర్కారు ప్రకటించడంతో చిత్ర పరిశ్రమ వర్గాలు ఒక్కసారిగా షాకయ్యాయి. మరో 20 రోజుల్లో సంక్రాంతి సందర్భంగా వరుస సినిమాలు బాక్సాఫీస్‌కు క్యూ కడుతున్నాయి. ఇందులో భారీ బడ్జెట్, అగ్ర కథానాయకుల సినిమాలు ఉండటంతో వాటి వసూళ్లపై తీవ్ర ప్రభావం పడనుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మించిన 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం'లతో పాటు, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ నిర్మిస్తున్న 'డాకు మహారాజ్' కూడా సంక్రాంతికే విడుదల కానుంది. 'పుష్ప2'కు ఇచ్చినట్లే వీటికి కూడా ప్రీమియర్ షోలు, టికెట్‌రేట్ల పెంపు ఉంటుందని అంతా అనుకున్నారు. కానీ, సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన మొత్తం పరిస్థితులనే మార్చేసింది. సినిమాలకు సంక్రాంతి సీజన్ ఎంతో కీలకం. అగ్ర కథానాయకుడి నుంచి, చిన్న హీరో వరకూ కుదిరితే తమ మూవీని ముగ్గుల పండగకు తీసుకొద్దామని అనుకుంటారు. తెలంగాణ సర్కారు తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో సీఎం రేవంత్‌నే నేరుగా కలిసి, చిత్ర పరిశ్రమకు కలిగే నష్టాన్ని వివరించనున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి సినిమాల టికెట్ రేట్లు, ఇతర మినహాయింపుల విషయంలో చర్చించనున్నారు. ఇటీవలే నిర్మాత దిల్‌రాజుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవిని ఇచ్చింది. ఆయన్ను తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్‌గా నియమించింది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన వస్తే కానీ, తదుపరి కార్యాచరణ ఏంటన్నది తెలియదు.

న్యూ ఇయర్ వేడుకల్లో జాగ్రత్త

హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవు
రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు

హైదరాబాద్,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు కీలక సూచనలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, న్యూ ఇయర్ వేడుకలను సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ వేడుకలు నిర్వహించాలని, ఉల్లంఘనలకు దిగితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఏడాది రాచకొండ పోలీస్ శాఖ 253 డ్రగ్స్ కేసులు నమోదు చేసిందని, 521 నిందితులను అరెస్ట్ చేయడం ద్వారా రూ. 88 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను సీజ్ చేసినట్లు సుధీర్ బాబు వెల్లడించారు. ఇంకా, 30 మందికి జీవిత ఖైదు విధించడం ద్వారా మాదక ద్రవ్యాల అక్రమ చలామణి నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా, లోక్ అదాలత్ ద్వారా 11 వేలకుపైగా కేసులను పరిష్కరించినట్లు పేర్కొంటూ, ప్రజల భద్రత కోసం పోలీసులు కృషి చేస్తుండటాన్ని ఆయన వివరించారు. అంతేకాకుండా.. మోహన్ బాబు ఘటనపై స్పందిస్తూ.. మోహన్ బాబు కేసులో దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, మోహన్ బాబు వాళ్ళ టైం అడిగారు ఆ టైం తరువాత అవసరమైన చర్యలు చేపడతామన్నారు సీపీ సుధీర్ బాబు. అవసరమైతే మోహన్ బాబుకు మరోసారి నోటీసులు జారీ చేస్తామని, బౌన్సర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. బౌన్సర్లకు ప్రత్యేక గై÷-లడైన్సును రూపొందిస్తామని, బౌన్సర్లు తోపులాటలు చేసి భయంకరమైన వాతావరణం క్రియేట్ చేస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీని ఉపయోగించి క్రైమ్ రేటు తగ్గించామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. 2024లో మొత్తం 33,084 కేసులు నమోదయ్యాయని చెప్పారు. కమిషనరేట్ పరిధి నేర వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. 'ఈ ఏడాది నమోదైన 33,084 కేసుల్లో 25,143 కేసులు పరిష్కరించాం. 3 షిఫ్టుల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేశాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాం. ఈ ఏడాది రాష్ట్రంలో అత్యధిక కేసులను పరిష్కరించిన కమిషనరేట్‌గా రాచకొండ నిలిచింది. మా పరిధిలో నమోదైన కేసుల్లో 30 మందికి జీవిత ఖైదు శిక్ష పడింది. అందులోనూ అగ్రస్థానంలో నిలిచాం. సంచలనం సృష్టించిన మోటకొండూరు పీఎస్ పరిధిలో 14 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. వివిధ కేసుల్లో 160 మందికి శిక్ష ఖరారైంది. లోక్ అదాలత్‌లో 11,440 కేసులతో పాటు 70,791 పెట్టీ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది డయల్ 100 ద్వారా 2,41,742 ఫిర్యాదులు వచ్చాయి. అన్ని విభాగాల్లో కలిపితే క్రైమ్ రేటు 4? మాత్రమే పెరిగింది. గతేడాదితో పోలిస్తే హత్యకేసుల్లో ఎలాంటి మార్పు లేదు. చోరీ కేసులు 6?, డొమెస్టిక్ వయిలెన్స్ కేసులు 23? తగ్గాయి. రూ.88.25 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశాం. మొత్తం 521 మంది డ్రగ్ నేరస్థులను అరెస్ట్ చేశాం. ఆ నిందితులపై 165 రౌడీషీట్లు ఓపెన్ చేశాం. ఎన్నికల సందర్భంగా రూ.16 కోట్ల నగదు, మద్యం సీజ్ చేశాం. సైబర్ బాధితులకు రూ.22 కోట్లు రిఫండ్ అయ్యేలా చర్యలు చేపట్టాం అన్నారు. కమిషనరేట్ పరిధిలో హద్దు దాటే బౌన్సర్లపై తీవ్ర చర్యలు ఉంటాయి. భయానక వాతావరణాన్ని సృష్టించడంతో పాటు ప్రజలన

పివికి సిఎం రేవంత్ రెడ్డి నివాళి

హైదరాబాద్,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు నేతలు ఘనంగా నివాళి అర్పించారు. సిఎం రేవంత్ తన నివాసంలో పివి చిత్రపటం వద్ద ఘనంగా నివాళి అర్పించారు. పివి ప్రధానిగా చేసిన సేవలను స్మరించుకున్నారు. దార్శనిక నేత పివి అని కొనియాడారు. తెలుగు ముద్దుబిడ్డ ప్రధానిగా దేశానికి దిశా నిర్దేశం చేశాడని కీర్తించారు.

ఆర్థిక రంగాలను బలోపేతం చేసిన మహోన్నతుడు పీవీ: హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఋషి ప్రతినిధి): ఆర్థిక రంగాలను బలోపేతం చేసి నూతన శంకాన్ని ప్రారంభించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా హరీశ్ రావు నివాళులర్పించారు. భారత రాజకీయ, ఆర్థిక రంగాలను కొత్త గమ్యాలకు తీసుకెళ్లిన మహోన్నత నాయకుడని చెప్పారు. ఆయన చూపిన దారే నేటి అభివృద్ధి పునాది అని వెల్లడించారు. పీవీ నరసింహారావు సేవలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుదామని కోరుకుంటున్నాని చెప్పారు. 'తెలంగాణ ముద్దుబిడ్డ, భారత రత్న, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు గారి వర్ధంతి సందర్భంగా నివాళి. భారతదేశ రాజకీయ, ఆర్థిక రంగాలను కొత్త గమ్యాలకు తీసుకెళ్లిన మహోన్నత నాయకుడు. ఆయన చూపిన దారే నేటి అభివృద్ధి పునాది. పీవీ గారి సేవలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుదామని కోరుకుంటున్నాను.' అంటూ ట్వీట్ చేశారు.

సందేశాత్మక చిత్రాలకు చోటేది

జైభీమ్ లాంటి సినిమాలకు అవార్డులేవీ
స్మగ్లర్ లాంటి పుష్ప సినిమాలకు అవార్డులా
మంత్రి సీతక్క ఆవేదన

ములుగు,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప సినిమా వివాదంపై తెలంగాణ మంత్రి సీతక్క సోమవారం ములుగులో సంచలన వ్యాఖ్యలు చేశారు. జై బీమ్ లాంటి సందేశాత్మక సినిమాలకు అవార్డులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి చిత్రాలకు ప్రోత్సాహాకాలు సైతం లేవన్నారు. కానీ ఒక స్మగ్లర్.. పోలీస్ దుస్తులు విప్పి నిలబెట్టి.. పోలీస్‌స్టేషన్ కొన్న సినిమాలకు మాత్రం కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇవ్వడం దేనికి సంకేతమన్నారు. స్మగ్లర్ హీరో అంటే అదేం సినిమా? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. స్మగ్లర్ హీరో.. స్మగ్లింగ్ కట్టడి చేసే పోలీస్.. విలన్ ఎలా అవుతాడని మంత్రి సీతక్క సందేహం వ్యక్తం చేశారు. అయితే సందేశాత్మక సినిమాలు తీస్తే ప్రజలు స్వాగతిస్తారని ఆమె స్పష్టం చేశారు. రెండు హత్యలు చేసిన నేరస్థుడు మహారాష్ట్రలో పుష్ప 2 సినిమా చూస్తూ దొరికిపోయాడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి సినిమాలు నేర ప్రవృత్తిని పెంచేలా ఉన్నాయని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. అయినా మానవతా దృక్పథం ఉన్న సినిమాలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మతాలు, కులాలు ముఖ్యం కాదని.. మనిషికి ఉండవలసింది మానవత్వమని సీతక్క స్పష్టం చేశారు. మానవత్వం ఉన్న సినిమాలకు ప్రోత్సాహం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆమె సూచించారు. చంకలో బిడ్డ పెట్టుకుని ఒక పేద మహిళపై హక్కులు కోసం పోరాడిన జై బీమ్ సినిమాకు అవార్డు సైతం రాలేదన్నారు. అయితే సినిమాలను మాత్రం తాము గౌరవిస్తామని చెప్పారు.

పీవీ తెలంగాణలో పుట్టడం గర్వకారణం: కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్ 22 (ఋషి ప్రతినిధి): ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమని చెప్పారు. గడ్డు కాలంలో దేశానికి ప్రధానిగా సేవలందించిన పీవీ.. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడారని, తన పాలనతో ఆధునిక భారతానికి బాటలు వేశారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత.. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహా రావు గారిని బీఆర్ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని వెల్లడించారు. పీవీ నరసింహా రావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు. నెక్లెస్ రోడ్‌కి పీవీ మార్గ్ అని పేరు పెట్టిందని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టిందని చెప్పారు. అంతే కాదు.. పీవీ నరసింహా రావుకి భారతరత్న ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపించిందని తెలిపారు. వారి కూతురిని ఎమ్మెల్సీగా గౌరవించిందన్నారు. భారతరత్న పీవీ.. తెలంగాణ ఠీవి అని ఎక్స్ వేదిగా ట్వీట్ చేశారు.

వంగరలో నవోదయ విద్యాలయం
పివి వర్ధంతి వేడుకల్లో మంత్రి పొన్నం

హనుమకొండ,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): నవోదయ విద్యాలయాన్ని వంగరలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. భీమదేవరపల్లి మండలం వంగరలో పీవీ నరసింహారావు 20వ వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, పీవీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... వారసత్వం లేకుండా నాటి రాజకీయాల్లో ఎదిగిన వ్యక్తి పీవీ నర్సింహారావు అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. భారతదేశానికి ఆర్థిక స్వాతంత్రాన్నితెచ్చిన వ్యక్తి పీవీ అని చెప్పారు. ఢిల్లీకి రాజైన తల్లికి కొడుకే అన్నట్లుగా.. ప్రధాని అయినా తన ఊరి గురించే ఎక్కువగా ఆలోచించిన వ్యక్తి పీవీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. ఇదిలావుంటే మానవీయ విలువలతో అందరూ కలిసి మెలిసి ఉంటూ.. ఎలాంటి ఘర్షణలు లేకుండా అందరూ ప్రేమ, ఆప్యాయతలతో ముందుకు పోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పర్యటించారు. హుస్నాబాద్‌లోని లక్ష్మి గార్డెన్స్‌లో తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు -2024 కార్యక్రమం జరిగింది.

పట్నం నరేందర్ రెడ్డికి ఊరట
బొంరాస్‌పేట కేసులో ముందస్తు బెయిల్

హైదరాబాద్,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. బోంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం ముందస్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణకు సహకరించాలని, 25 వేల సొంత పూచికత్తు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. లగచర్ల దాడి ఘటనలో అరెస్టయిన నరేందర్ రెడ్డి ఇప్పటికే బెయిల్‌పై బయటికి వచ్చారు. లగచర్ల దాడి ఘటన కంటే ముందే ఆయనపై బోంరాస్ పేట పోలీసులు మరో కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ నరేందర్ రెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాగా, నవంబర్ 11న కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూములు సేకరించేందుకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులపై దాడి చేశారంటూ 24 మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అల్లర్లకు కుట్ర చేశారంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్, సురేశ్ అనే మరో వ్యక్తిని సైతం అరెస్టు చేశారు. రైతులు, ఎమ్మెల్యేను చర్లపల్లి, సంగారెడ్డి జైళ్లకు తరలించారు. దీనిపై తెలంగాణ హైకోర్టును మాజీ ఎమ్మెల్యే ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం 24 మంది రైతులతోపాటు పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది.

అల్లుఅర్జున్ ఇంటి దాడిలో కేసులో నిందితులకు బెయిల్ మంజూరు

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఋషి ప్రతినిధి): స్టార్ హీరో అల్లు అర్జున్ ఇంటిపై దాడి కేసులో నిందితులకు కోర్టు బెయిల్ విధించింది. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి అల్లు అర్జున్‌పై విమర్శలు చేయడం, తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం జరుగుతున్నదని అల్లు అర్జున్ ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆదివారం మరోసారి ఉద్రిక్తత పరిస్థితి తలెత్తిన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటిపై 10 మంది యువకులు దాడి చేశారు. గేట్లను తోసుకుంటూ ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. అడ్డుకున్న సిబ్బందిని చితకబాదారు. ఆవరణలోని పూలకుండీలను ధ్వంసం చేశారు. అల్లు అర్జున్ ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. అల్లు అర్జున్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వచ్చి యువకులను అరెస్ట్ చేశారు. అల్లు అరవింద్ మేనేజర్ కాంతారావు ఫిర్యాదు మేరకు కేసు బీఎన్ఎస్ 331(5), 190, 191(2), 324(2), 292, 126(2), 131 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఓయూ జేఏసీ నేతలుగా చెప్పుకున్న వారిని చౌటుప్పల్‌కు చెందిన నాగరాజ్, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నగేశ్, కొడంగల్ నియోజకవర్గానికి చెందిన రెడ్డి శ్రీనివాస్, మోహన్, చర్లపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్, షాద్‌నగర్‌కు చెందిన ప్రకాశ్‌గా గుర్తించారు. కాగా, సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీసులు నిందులను వనస్థలిపురంలోని జడ్జి నివాసంలో హాజరుపరిచారు. దీంతో వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.10 వేల చొప్పున ఒక్కొక్కరు రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. ఓయూ జేఏసీ నేతలు కాదు..దాడికి పాల్పడిన వారు ఓయూ జేఏసీ పేరుతో ప్లకార్డులు ప్రదర్శించారు. కానీ వాళ్లు ఓయూ జేఏసీ నేతలు కాదని పోలీసులు స్పష్టంచేశారు. దాడిలో కీలకపాత్ర పోషించిన రెడ్డి శ్రీనివాస్ కొడంగల్ నియోజకవర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుర్తించారు. 2019లో కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా కూడా పోటీ చేశాడని, అతడు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి అత్యంత సన్నిహితంగా వ్యవహరిస్తుంటాడని తెలుస్తున్నది. మిగిలిన యువకులు కూడా కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేస్తున్నారని సమాచారం. మరోవైపు దాడిలో పాల్గొన్న రెడ్డి శ్రీనివాస్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. మళ్లీ 1500మందితో వచ్చి దాడి చేస్తామని ఆ వీడియోలో హెచ్చరించాడు.

నిజజీవితంలోనూ నటిస్తున్నారు
రామ్ చరణ్, అల్లు అర్జున్ కంటే సోనూసూద్ నయం
కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): సినీ తారలు సినిమాల్లోనే కాదు నిజ జీవితంలో కూడా నటిస్తున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి గాటుగా అన్నారు. ప్రజలకు కష్టాలు వస్తే రామ్ చరణ్, అల్లు అర్జున్ వస్తారని నమ్మకం లేదని.. ఈ నటుల కంటే సోనూ సూద్ నయమన్నారు. ఈ నటుల కంటే సమంత, మంచు లక్ష్మి ఎంతో ఆదర్శంగా ఉంటారని తెలిపారు. వందల కోట్ల పారితోషికం తీసుకుంటూ కృత్రిమ సమాజంలో బతుకుతున్నారన్నారు. పిల్లలకు పుస్తకాలు ఇద్దామని అంటే తనకేం వస్తుందని ఒక నటుడు అన్నారన్నారు. సినీతారలు రాతి హృదయంతో ఉంటారంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయాలు అల్లు అర్జున్ వివాదం చుట్టూనే తిరుగుతున్నాయి. అల్లు అర్జున్‌పై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. తాజాగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. గొప్ప వాళ్ళం అని విర్రవీగే సినీ నటులకు ఎమ్మెల్యే యెన్నం సూటి ప్రశ్న వేశారు. సినీ నటులు ఎవరైనా స్కూళ్లను, హాస్పిటల్స్‌ను దత్తత తీసుకున్నారా అని నిలదీశారు. సామాజిక అంశాలపై స్పందించడానికి కూడా సినీ నటులు డబ్బులు వసూలు చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ముప్పై వేల జీతం వచ్చినా మూడు వేల రూపాయలతో టికెట్ కొని సినీ తారల స్టార్‌డం కాపాడుతున్నారని అన్నారు. అర్ధరాత్రి పబ్బుల్లో, గోవాలో పార్టీల్లో నటులు ఉంటారన్నారు. ప్రజలకు ఇబ్బందులు వస్తే కనీసం ఒక్కరూ కూడా స్పందించరని మండిపడ్డారు. పాపులారిటీలో సినీ నటుల కంటే రాజకీయ నాయకులు తక్కువగా కనిపిస్తారు కానీ ప్రజా సంబంధాల విషయంలో తామే చాలా బెటర్ అని అన్నారు. ప్రజలను మనుషులుగా చూడాలని ఎమ్మెల్యే హితవుపలికారు. తమిళ నటులకు ఉన్న సామాజిక స్పృహ తెలుగు నటులకు ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇండియాలో రికార్డు హిట్స్ ఇచ్చాం కదా అని అన్నారు. వైద్యానికి, చదువుకి దాచుకున్న డబ్బులతో వాళ్ళ సినిమాలకి వెళ్తే అభిమానుల గుండెల్లో గునపాలు దించుతున్నారంటూ విరుచుకుపడ్డారు. టెక్ని షియన్లను రెండు మూడు కుటుంబాలు తొక్కే స్తున్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ వాళ్ళకి ఎన్ని అవకాశాలు ఇచ్చారో లెక్క తీద్దామా అని అన్నారు. 'సినీ ఇండస్ట్రీ నుంచి ఎవరైనా చర్చకు వస్తే నేను తెలంగాణ కు జరిగిన అన్యాయంపై లెక్కలు బయట పెట్టడానికి రెడీ' అంటూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు.

నటుడు మోహన్‌బాబుకు చుక్కెదురు
ముందస్తు బెయిల్ నిరాకరించిన హైకోర్టు

హైదరాబాద్,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి):తెలంగాణ హైకోర్టులో ప్రముఖ సినీ నటుడు మోహన్‌బాబుకు చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. విలేకరులపై దాడి కేసులో మోహన్‌బాబుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టు చేయకుండా కోర్టులో ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఆరోగ్య సంబంధిత కారణాలతో ఆయన మందస్తు బెయిల్‌ను కోరారు. మోహన్‌బాబుకు గుండె, నరాల సమస్యలు ఉన్నాయని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఆయన దేశంలో ఉన్నారని కోర్టుకు తెలిపారు. మోహన్‌బాబు ఎక్కడకి వెళ్లలేదని.. మనుమరాలు పుట్టిన రోజు వేడుకల కోసం దుబాయి వెళ్లి వచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు తిరుపతిలో ఉంటున్నట్లుగా న్యాయవాది కోర్టుకు చెప్పారు. అయితే, మోహన్‌బాబుకు బెయిల్ ఇవ్వొద్దని ఏపీపీ కోరారు.

అమెరికాలో తెలంగాణ విద్యార్థి మృతి
హన్మకొండ జిల్లా మాదన్నపేటకు చెందిన వంశీగా గుర్తింపు

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఋషి ప్రతినిధి): అమెరికాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాల కోసం యూఎస్ వెళ్లిన పలువురు విద్యార్థులు అక్కడ జరిగిన ప్రమాదాల్లో మరణిస్తున్నారు. తాజాగా తెలంగాణకి చెందిన ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన 25 ఏళ్ల బండి వంశీ గతేడాది జులైలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ మిన్నెసొటాలో పార్ట్‌టైం జాబ్ చేస్తూ.. ఎంఎస్ చదువుతున్నాడు. అయితే, అతడు ఆదివారం తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కారులో శవమై కనిపించాడు.

పివికి ప్రముఖుల నివాళి
తెలుగు వాడైనందుకు గర్వకారణమని వెల్లడి

హైదరాబాద్,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు నేతలు ఘనంగా నివాళి అర్పించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎస్ వేణుగోపాలాచారి, పివి కుటుంబ సభ్యులు వాణి తదితరులు పివి ఘాట్ వద్ద పుష్పాంజలి అర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ పివి తెలుగు వాడైనందుకు గర్వకారణమని అన్నారు. ఆయన సంస్కరణలు దేశానికి మార్గం చూపాయని అన్నారు. దేశాన్ని క్లిష్ట సమయంలో ఆదుకున్నారని అన్నారు. పివి తెలంగాణ రాష్ట్రంలో పుట్టడం మన అదృష్టమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పీవీ నరసింహారావు అనేక నిధులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇక, పీపీ భూ సంస్కరణల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. దేశంలో విద్య వ్యవస్థను పటిష్టం చేసేందుకు పీవీ అద్భుతమైన ప్రణాళికలు రూపొందించారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంతో పోటీ పడే విధంగా పీవీ కృషి చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న అనేక నిర్ణయాలను పీవీ అమలు చేశారని అన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు పీవీ చూపించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ దేవానికి దిశాదశ చూపిన నేతని అన్నారు. ఆయన సంస్కరణలు ఎప్పటికీ మరువలేనివన్నారు.

బీసీలకు తిరిగి 34% రిజర్వేషన్లకు నిర్ణయం

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంపై మంత్రుల కమిటీ.. బీసీ హాస్టళ్లలో వసతుల కల్పన, బాలికల హాస్టళ్లలో తక్షణ మరమ్మత్తులు

104 బీసీ హాస్టళ్లలో ఎస్.ఆర్.శంకరన్ నాలెడ్జ్ కేంద్రాలు

బీసీ సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం నారా చంద్రబాబు నాయుడు

అమరావతి,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): స్థానిక సంస్థల్లో బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్ల సాధనకు న్యాయ పరమైన పోరాటం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంపై మంత్రుల కమిటీ సూచనలపై సమీక్షలో చర్చించారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పన, బాలికల హాస్టళ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. పింఛన్లు తొలగించడం లేదని.. ఇందుకు సంబంధించిన తనిఖీలు జరుగుతున్నాయని సీఎం స్పష్టం చేశారు. స్కిల్ ఎడ్యుకేషన్ కోసం 104 బీసీ హాస్టళ్లలో ఎస్ఆర్. శంకరన్ నాలెడ్జ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై సీఎం సమీక్షించారు. అందరికీ ఇచ్చేలా పథకాలు ఇస్తూనే.....వెనుకబడిన వర్గాలకు ప్రత్యేకంగా లబ్ధి జరిగేందుకు పలు కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా బీసీల కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు కూటమి ప్రభుత్వం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రుల కమిటీ ప్రాథమికంగా ఇచ్చిన సూచనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరికొంత కసరత్తు తరువాత...సాంకేతిక, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈ చట్టాన్ని తీసుకురావాలని సీఎం అధికారులకు సూచించారు. అదే విధంగా నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న హామీకి కట్టుబడి ఉన్నామని....దీనికి కూడా చట్టబద్ధత తెస్తామని సీఎం తెలిపారు. దీనిపై రానున్న రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని సీఎం అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బీసీలు స్థానిక సంస్థల్లో 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను కోల్పోయారని, రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గడంతో బీసీలు 16,500 పదవులకు దూరమయ్యారన్నారు. వీటిని పునరుద్ధరించేందుకు న్యాయపరమైన సమస్యల పరిష్కారంపై సీఎం సమీక్షలో చర్చించారు. న్యాయపరంగా తిరిగి 34 శాతం రిజర్వేషన్లు పొందడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కోర్టు తీర్పులు పరిశీలించి.....న్యాయ పరంగా ముందుకెళ్లాలని సీఎం అధికారులకు సూచించారు.సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనబీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. బాలికల హాస్టళ్లు తక్షణమే మరమ్మతులు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 1,110 బీసీ విద్యార్థుల హాస్టళ్లు ఉన్నాయి. వాటిల్లో బాలురు 58022 మంది, బాలికలు 37794 మంది ఉంటున్నారు. ప్రభుత్వ భవనాలు 660 ఉండగా, అ÷-దదె భవనాలు 450 ఉన్నాయి. గత ప్రభుత్వం పెట్టిన రూ.110.52 కోట్ల డైట్ బిల్లుల్లో రూ.76.38 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించగా రూ.34.14 కోట్లు పెండింగులో ఉన్నాయి...వాటిని కూడా చెల్లించాలని ఆదేశించారు. 2024-25 సంవత్సర బ్జడెట్లో ప్రభుత్వం రూ.135 కోట్లు కేటాయించింది. ఆగస్టు నాటికి కాస్మోటిక్ బిల్లులు కూడా రూ.20 కోట్లు పెండింగులో ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.7.10 కోట్లు చెల్లించింది. విద్యార్థుల ట్రంక్ బాక్సులు, ఇతర వస్తువులకుగాను ప్రభుత్వం బ్జడెట్ లో రూ.18 కోట్లు కేటాయించింది. వీటిని త్వరలోనే ప్రభుత్వం కొనుగోలు చేసి విద్యార్థులకు అందించనుంది. డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీల చెల్లింపు, ట్యూటర్ ఫీజు, హాస్టళ్ల మైనర్ రిపేర్లను వెంటనే పూర్తి చెయ్యాలని సీఎం ఆదేశించారు. 13 బీసీ స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లను మంజూరు చేసి 5720 మంది డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించారు. త్వరలోనే ఆన్ లైన్ తరగతులు కూడా చేపట్టనున్నారు. సివిల్స్ కు ఏటా 100 మందికి శిక్షణ ఇచ్చేందుకు స్టడీ సర్కిల్ను ప్రభుత్వం ప్రారంభించింది. సీఆర్డీఏ పరిధిలో 5 ఎకరాలను సివిల్ సర్వీస్ కోచింగ్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించనుంది. దీని కోసం ఇప్పటికే భవనానికి సంబంధించిన డీపీఆర్ సిద్ధం కాగా..500 మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసింది. 2014-19 మధ్య విదేశాల్లో చదువుకున్న బీసీ విద్యార్థులకు రూ.81.65 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వం నిధులు చెల్లించకుండా బకాయిలు పెట్టింది. వీటి కోసం 2024-25 బ్జడెట్ లో రూ.36.11 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఉమ్మడి జిల్లాల్లో 13 బీసీ భవనాల నిర్మాణాలకు 2016-17లో నాటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 3 భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఒక్కో భవనం పూర్తికి రూ.5 కోట్లు ఖర్చు కానుండగా పెరిగిన ఖర్చుల నేపథ్యంలో రూ.10 కోట్లు కేటాయించాలని బీసీ నేతలు కోరుతున్నట్లు సమీక్షలో చర్చించారు. అయితే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మూడు బీసీ భవనాలు త్వరితగతిన పూర్తి చెయ్యాలని సీఎం ఆదేశించారు. మిగిలిన భవనాల నిర్మాణానికి ఇతర జిల్లాల్లో భూసేకరణ పూర్తి చెయ్యాలని ముఖ్యమంత్రి చెప్పారు. బీసీల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బ్జడెట్ లో రూ.896.79 కోట్లు కేటాయించింది. రుణాల మంజూరుకు సంబంధించి యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. గొర్రెల పెంపకం దారులకు అందించాల్సిన చేయూతపైనా సమీక్షలో చర్చ జరిగింది. అదే విధంగా గత తెలుగుదేశం హయాంలో 13 జిల్లాల్లో కాపు భవన్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ. 2 కోట్ల చొప్పున కేటాయించేందుకు నిర్ణయించింది. అయితే వీటిలో 4 భవనాల నిర్మాణం ప్రారంభం కాగా గత ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. నిలిచిపోయిన 4 కాపు భవనాలను కూడా పూర్తి చేసేందుకు అవసరమైన రూ.5.40 కోట్ల విడుదలకు సీఎం అంగీకారం తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏపీ బ్రాహ్మిణ్ కో-ఆపరేటివ్ ÷నాన్స్ సొసైటీ ఏర్పాటు ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని అధికారులు వివరించగా....ప్రతి సామాజిక వర్గానికి ఇలా కో-ఆపరేటివ్ ÷నాన్స్ సోసైటీ ఏర్పాటు చేసి ఆయా వర్గాలను బలోపేతం చేసేందుకు పని చేయాలని సీఎం సూచించారు. ప్రతి సామాజికవర్గంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న వాళ్లు తమ వర్గానికి ఎంతో కొంత సాయం చెయ్యాలని చూస్తున్నారని...ఇలాంటి వారిని ప్రోత్సహించి ఆర్థికంగా ఆయా సామాజిక వర్గాల్లో ఉన్న పేదలను పైకి తెచ్చేందుకు ప్రయత్నం చేయాలని సీఎం సూచించారు.ఎస్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్లురాష్ట్రంలో త్వరలో ఎస్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. స్కిల్ ఎడ్యుకేషన్లో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, సోషల్ ఎమోషనల్ స్కిల్స్, నైతిక విలువలు, నీతిశాస్త్రం, డిజిటల్ లిటరసీ, లీగల్ అవేర్నెస్ వంటివి ఈ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అందించనున్నారు. 26 జిల్లాల్లోని 104 బీసీ హాస్టళ్లలో పైలట్ ప్రాజెక్టులుగా దీన్ని అమలు చేయనున్నారు. త్వరలోనే ఈ సెంటర్లను ప్రభుత్వం బీసీ విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకురానుంది. సామాజిక పింఛన్ల తనిఖీ జరపండి..అర్హులకే పింఛన్లు అందాలిసమీక్షలో సామాజిక పింఛన్ల పంపిణీ అంశంపైనా చర్చ జరిగింది.

రోడ్డు నాణ్యతను పరిశీలించిన పవన్

44 గ్రామాల మంచినీటి పనులకు మరమ్మత్తులు

కృష్ణా జిల్లాలో పలు పనులకు శంకుస్థాపన

విజయవాడ,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): కంకిపాడు మండలంలోని గొడవర్రు గ్రామంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోమవారం పర్యటించారు. రూ.3.5 కోట్ల వ్యయంతో శరవేగంగా జరుగుతున్న గొడవర్రు -రొయ్యూరు రోడ్డు పనులను పవన్ పరిశీలించారు. ఇటీవల కంకిపాడులో జరిగిన బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విజ్ఞప్తి మేరకు ఆధ్వాన్నంగా ఉన్న రొయ్యూరు రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలంటూ పవన్ ఆదేశాలు జారీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు పనులు తుదిదశకు చేరుకోవడంతో పవన్ పరిశీలించారు. స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఇకపోతే జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. గుడివాడ నియోజకవర్గం పరిధిలోని మల్లాయపాలెం గ్రామంలో పర్యటించారు. గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పరిశీలించారు. గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గం పరిధిలోని 44 గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరరా వ్యవస్థకు మరమ్మత్తులు చేపట్టారు. గ్రామీణ ప్రాంతంలో నీటి సరఫరా సరిగా లేదన్న విషయం పల్లె పండుగ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ దృష్టికి గుడివాడ శాసనసభ్యుడు వెనిగండ్ల రాము తీసుకురాగా... రూ. 3.8 కోట్ల నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఫిల్టర్ బెడ్లు పూర్తిగా దెబ్బ తినడంతో పంచాయతీకి రూ. 4 లక్షల ఖర్చు చేసి ఫిల్టర్ బెడ్లు మార్పు చేశారు. 14 గ్రామాల పరిధిలో ఫిల్టర్ బెడ్ల మార్పు ప్రక్రియ పూర్తి అయిన క్రమంలో సోమవారం శ్రీ పవన్ కళ్యాణ్ గారు మల్లాయపాలెం రక్షిత మంచి నీటి సరఫరా కేంద్రం వద్ద క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. స్టోరేజీ ట్యాంక్, ఫిల్టర్ బెడ్లతోపాటు- 14 గ్రామాల్లో మరమ్మతులకు ముందు, తర్వాత నీటి నమూనాలను పరిశీలించారు. క్షేత్ర స్థాయి పరిశీలన నిమిత్తం గుడివాడ నియోజకవర్గానికి వచ్చిన పవన్ కళ్యాణ్ కి స్థానిక శాసనసభ్యులు వెనిగెండ్ల రాము ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గారు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ , జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.గుడివాడలో జనసేన, బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు.

భోగాపురం విమానాశ్రయ పనుల్లో వేగం

అధికారులకు సిఎస్ ఆదేశం

అమరావతి,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): భోగాపురం అంతర్జాతీయ నిర్మాణ పనులను నిర్దిష్ట కాలపరిమితికి లోబడి సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖలు,ఏజెన్సీలకు సూచించారు.ఈమేరకు సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన మొదటి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం సిఎస్ నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈఅంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను వేగవంతంగా సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విమానాశ్రయ నిర్మాణంతో పాటు అక్కడ వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీల ద్వారా ఏర్పాటు చేయాల్సిన ఏర్పాట్లను కూడా సిఎస్ సమీక్షించారు. ముఖ్యంగా కస్టమ్స్,బ్యూరో ఇమిగ్రేషన్,సిఐఎస్ఎఫ్ భద్రత,ఆరోగ్య తదితర శాఖల పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.అదే విధంగా విశాఖపట్నం నగరం నుండి భోగాపురం విమానాశ్రయానికి మెరుగైన కనక్టవిటీ తదితర అంశాలపై కూడా సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.

ఐదంతస్తుల వరకు అనుమతులు అక్కర్లే

పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

గుంటూరు,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): భవన నిర్మాణాల కోసం ఐదు అంతస్తుల వరకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేస్తే సరిపోతుందని అన్నారు. లేఅవుట్, భవనాలకు సంబంధించి మున్సిపాలిటీకి రుసుము చెల్లిస్తే అనుమతులన్నీ ఇస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పట్టణాల్లో రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు, వరదనీరు, ఘనవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై 15 రోజుల్లో డీపీఆర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పాతపన్ను బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఆచార్య నాగార్జున వర్సిటీలో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. దీనికి 123 మంది పురపాలక కమిషనర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ.. నెల్లూరు, కాకినాడ, రాజమండ్రిలో ఘనవ్యర్థాల నిర్వహణకు అనుమతి వచ్చిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో చెత్త సమస్య పరిష్కారమవుతోందని చెప్పారు. ‘ 20142019 మధ్య మున్సిపల్ శాఖ పనితీరు అద్భుతంగా ఉంది. ఈ సమయంలో మున్సిపల్ పన్నులు రూపాయి కూడా పెంచలేదు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం మున్సిపల్ నిధులను పక్కదారి పట్టించింది. ప్రస్తుతం పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. సీఎఫ్ఎంఎస్తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు కేటాయిస్తాం. 123 మున్సిపాలిటీలకు తాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

జూన్ 12కల్లా 1.18 లక్షల టిడ్కో గృహాలు పూర్తి

వెల్లడించిన మంత్రినారాయణ

అమరావతి,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): రాజధాని అమరావతిలో మరో రూ.2,723 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. జూన్ 12 నాటికి 1.18 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. సచివాల యంలో జరిగిన సీఆర్డీఏ 44వ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఎల్పీఎస్ జోన్ 7, జోన్ 10లో మౌలిక వసతుల కల్పనకు నిర్ణయం తీసుకు న్నారు. రాజధాని ఔటర్ రింగ్రోడ్డు, విజయవాడ బైపాస్ రోడ్డు ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చిం చారు. ఇప్పటి వరకు రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. మూడు సంవత్సరాల్లో అమరావతి రాజధాని అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం అన్నారు. జధాని అభివృద్ధికి అయ్యే వ్యయా భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయం అన్నారు. రాజధాని భూములు అమ్మగా వచ్చే సొమ్మునే రుణాలు తీర్చేందుకు ఉపయోగిస్తాం అన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలను సమానం అభివృద్ధి పర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన ఇనిర్ణయించారు. సమావేశానంతరం వివరాలను మంత్రి నారాయణ వెల్లడించారు. వచ్చే ఏడాది జూన్ 12 వ తేదీ కల్లా 1.18 లక్షల టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేసి, ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లా డుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన 44 వ సీఆర్డీఏ సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగిం దని, ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు ,టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిం దని తెలిపారు. ఇప్పటికే బ్యాంకు రుణాలు తీసుకుని నాన్ పెర్ఫార్మింగ్ ఎస్సెట్స్ గా మిగిలి పోయిన టిడ్కో గృహాలను పూర్తి చేయడానికి రూ.102 కోట్లను చెల్లించేందుకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెల్పారన్నారు. 2014-19 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వంచే 7,01,481 టిడ్కో గృహాలను మంజూరు చేయించి, వాటిలో 5.00 లక్షల గృహాలకు పరిపాలనాపరమైన అనుమ తులను కూడా మంజూరు చేయడం జరిగింద న్నారు. వాటిలో 4,54,706 గృహాలను గ్రౌండ్ చేయడం జరిగింది. అందులో 2019 నాటి 3,13, 832 గృహా నిర్మాణాలను ప్రారంభించడం జరిగిం ది. ప్రతి యూనిట్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు కలిసి మొత్తం రూ.3.90 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించగా, అందులో రూ.1.90 లక్షలు కేంద్ర ప్రభుత్వం, మిగిలిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేలా నిర్ణయించడం జరిగిందన్నారు.

చంద్రబాబుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి

ఉమ్మడి అనంతజిల్లాలో ఎస్సీ హాస్టళ్లకు 11.56 కోట్లు

మంత్రి డోలాకి ధన్యవాదాలు తెలిపిన సవిత

అమరావతి,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): సీఎం చంద్రబాబునాయుడు పాలనలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు అభివృద్ధికి ప్రాధాన్యం లభిస్తుంటుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల అభివృద్ధికి రూ.11.56 కోట్లు మంజూరు చేయడంపై ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి మంత్రి ఎస్.సవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని ఆయన కార్యాలయంలో మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల మరమ్మతులకు రూ.11. 56 కోట్లను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి డోలా వీరాంజనేయులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ఎస్టీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లను గాలికొదిలేసిందన్నారు. నా ఎస్సీలు...నా ఎస్టీలు...నా బీసీలు...అంటూ బడుగు బలహీన వర్గాల వారిని జగన్ ఓటు బ్యాంకుగా చూశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలు చదువు కోవడం జగన్ కు ఇష్టంలేదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోలేదన్నారు. చిన్న చిన్న మరమ్మతులకు నిధులు కూడా మంజూరు చేయలేదన్నారు. చివరికి విద్యార్థులకు ఇవ్వాల్సిన డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించలేదన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల మరమ్మతులకు, విద్యార్థుల డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించిన విషయాన్ని మంత్రి సవిత తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డల విద్యకు, అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులతో పాటు విద్యార్థుల డైట్ బిల్లులను కూడా చంద్రబాబు ప్రభుత్వం మంజూరు విషయాన్ని మంత్రి డోలా బాల వీరాంజనేయులకు మంత్రి సవిత తెలిపారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల మరమ్మతులకు నిధుల మంజూరు చేసినందకు ధన్యవాదాలు తెలుపుతూ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని మంత్రి సవిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబ్బులు కట్టినంత మాత్రాన పేర్ని దొర అవుతాడా

పేర్ని నానికి సహకరించే అధికారులపై చర్యలు

బియ్యం మాయంపై ప్రత్యేక దర్యాప్తును కోరుతా

మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

విజయవాడ,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని గోదాము ల్లో రేషన్ బియ్యం మిస్సింగ్ కేసుపై మంత్రి కొల్లు రవీంద్ర మరోమారు సీరియస్ అయ్యారు. ఈ కేసులో పేర్ని నానికి సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్న అధికారుల కు ఆయన వార్నింగ్ ఇచ్చారు. విచారణలో భాగంగా అధికా రుల పాత్ర ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యం కుంభకోణంపై సిట్ ఏర్పాటుకు సిఫార్సు చేస్తానన్నారు. తప్పు చేసి డబ్బులు కడితే పేర్ని నాని దొర అవుతాడా? అని మంత్రి ప్రశ్నించారు. పదేపదే నీతి వ్యాఖ్యలు చెప్పే పేర్ని నాని.. ఇపుడు ఎక్కడ ఉన్నాడని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. పేదల బియ్యం కొట్టేసిన పేర్ని నానిని పంది కొక్కులా చూడాలి. నీతులు చెప్పే నాని ఇప్పుడు అడ్రస్ లేరు. దొంగ పనులు చేసి.. నిత్యం నీతులు చెప్పేవారు. తప్పు చేసి డబ్బులు కడితే దొర అవుతాడా?. పదేపదే నీతి వ్యాఖ్యలు చెప్పే నాని.. ఇపుడు ఎక్కడ ఉన్నారు?. పేర్ని నాని కుటుంబం స్కాం చేసింది వాస్తవం, అది స్వయానా నాని ఒప్పుకున్నారు. దారి మళ్లిన పీడీఎస్ రైస్ స్కాంపై వివరణ ఇచ్చుకోలేని దుస్థితిలో నాని ఉన్నారు. తప్పు చేయనపుడు దొంగలా తప్పించుకొని తిరగడం ఎందుకని ప్రశ్నించారు. తప్పు చేసిన ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. స్కాంపై సిట్ ఏర్పాటుకు సిఫార్సు చేస్తాను. విచారణలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు. కక్ష సాధింపు చేయాల్సిన మాకు అవసరం లేదు. కక్ష సాధింపు చేస్తే స్కాంలో ఉన్న పేర్ని నాని కుటుంభం మొత్తాన్ని జైలుకు పంపేవాళ్లం. కానీ మేము అలా చేయలేదు' అని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. పేర్ని నాని అధికార దుర్వినియోగానికి పాల్పడి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారని ఆరోపణలు ఉన్నాయి. 32,00 బస్తాల రేషన్ బియ్యం తగ్గినట్టు అధికారులకు నాని లేఖ రాయగా.. అధికారుల పరిశీలనలో 3,708 బస్తాలు తగ్గినట్టు తేలింది. బియ్యం తగ్గడంపై 2 దఫాలుగా రూ.1.70 కోట్లు పేర్ని నాని చెల్లించారు. గోదాములు నాని భార్య జయసుధ పేరుతో ఉండటంతో పోలీసులు ఆమెపై కూడా కేసు నమోదు చేశారు.

మంచు గుప్పిట్లో జమ్ముకశ్మీర్

అత్యంత కనిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు

భూతల స్వర్గం జమ్ముకశ్మీర్ మంచు గుప్పిట్లో చిక్కుకుంది. దీంతో పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. కొన్ని ఏరియాల్లో అయితే మైనస్ డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పతనమయ్యాయి. దాంతో అక్కడి సరస్సులు, కొలనుల్లోని నీరు గడ్డకట్టింది. చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు.జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో మైనస్ డిగ్రీల్లో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కశ్మీర్ వ్యాలీలో కనిష్ట ఉష్ణోగ్రతలు మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. అందాల శ్రీనగర్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ 4.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అనంత్‌నాగ్‌లో మైనస్ 10.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీల సెల్సియస్ మేర స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆ తర్వాత డిసెంబర్ 26 వరకు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకూ తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఏకాంత ప్రాంతాల్లో చలిగాలులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. ఐఎండీ డేటా ప్రకారం.. షోపియాన్‌లో మైనస్ 10.4 డిగ్రీల సెల్సియస్, పుల్వామాలో మైనస్ 10.3 డిగ్రీల సెల్సియస్, లార్నూలో మైనస్ 9.3 డిగ్రీల సెల్సియస్, ఖుద్వానీలో మైనస్ 9.0 డిగ్రీల సెల్సియస్, సోనామార్గ్‌లో మైనస్ 8.8 డిగ్రీల సెల్సియస్, ప్రసిద్ధ పర్యాటక కేంద్రం పహల్గామ్‌లో కనిష్టంగా మైనస్ 8.6 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుద్గాం, ఖాజిగుండ్‌లో వరుసగా మైనస్ 8.3 డిగ్రీల సెల్సియస్, మైనస్ 8.2 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో కశ్మీర్ వ్యాలీ అంతటా చలి తీవ్రత పెరిగింది. అక్కడి సరస్సులు, కొలనుల్లోని నీరు గడ్డకట్టింది. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పర్యాటక ప్రాంతమైన దాల్ సరస్సులో చలి తీవ్రతకు నీరు గడ్డకట్టింది. ఈ చలికి సందర్శకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మొత్తంగా అందాల శ్రీనగర్ చలి గుప్పిట్లో వణుకుతోంది.

వందే భారత్ రైళ్లలో త్వరలో స్లీపర్ కోచ్‌లు

భారతీయ రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 23 (ఋషి ప్రతినిధి): భారతీయ రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పింది. లోడెడ్ సిమ్యులేషన్ ట్రయల్స్ కోసం కోచ్‌లను ఐసీఎఫ్ చెన్నైకి పంపినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ట్రయల్ తర్వాత రైళ్లు వివిధ నగరాల మధ్య రాకపోకలు సాగిస్తాయన్నారు. భారతదేశపు తొలి స్లీపర్ వందే భారత్ రైలు త్వరలో ట్రయల్ రన్ మొదలవనున్నది. అయితే, ట్రయల్ రన్ పూర్తయ్యేందుకు దాదాపు రెండునెలల సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం తొలి రైలు ఏ మార్గంలో నడుస్తుందనే చర్చ సాగుతున్నది. దేశంలోని వివిధ రైల్వే జోన్ల నుంచి రైల్వేబోర్డుకు భారీగానే ప్రతిపాదనలు వచ్చినట్లు రైల్వేవర్గాలు పేర్కొన్నాయి. ప్రధానంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబయి నుంచి ప్రారంభించేందుకు ఎక్కువగా అవకాశాలున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం వందే భారత్ స్లీపర్ రైలు చార్జీలు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయని రైల్వేశాఖ మంత్రి ఇప్పటికే స్పష్టం చేశారు.

47 డ్రోన్లను కూల్చివేశాం: ఉక్రెయిన్

న్యూఢిల్లీ,డిసెంబర్ 23 (ఋషి ప్రతినిధి): ఉక్రెయిన్ వైమానిక దళం కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా రష్యా ప్రయోగించిన 72 డ్రోన్లలో.. 47 డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. టెలిగ్రామ్‌లో దీనిపై ఆ దేశ సైన్యం ప్రకటన చేసింది. తమ మిలిటరీ తొమ్మిది ప్రదేశాల్లో దాడుల్ని తిప్పికొట్టిందన్నారు. కీవ్ ప్రాంతంలో అనేక ప్రైవేటు ప్రదేశాలు, ఇండ్లు ధ్వంసమైనట్లు ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొన్నది. కెమిలిన్‌స్టికి ప్రాంతంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. విద్యుత్తు లైన్ దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. 25 డ్రోన్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయని ఉక్రెయిన్ తెలిపింది.

మూడు పెళ్లిళ్లు..
రూ.1.25 కోట్ల మేర లూటీ

మహిళను అరెస్టు చేసిన పోలీసులు

జైపూర్,డిసెంబర్ 23 (ఋషి ప్రతినిధి): ఒక మహిళ పలువురిని పెళ్లాడింది. ఆ తర్వాత వారి నుంచి విడిపోయి డబ్బులు డిమాండ్ చేసింది. ఇలా ఇప్పటి వరకు ముగ్గురిని వివాహం చేసుకున్నది. వారి నుంచి రూ.1.25 కోట్ల మేర లూటీ చేసింది. మూడో భర్త ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేశారు. 'లూటీ వధువు'గా పేర్కొన్న ఆ మహిళను అరెస్ట్ చేశారు. ఉత్తరాఖండ్‌కు చెందిన నిక్కి అలియాస్ సీమ 2013లో ఆగ్రాకు చెందిన వ్యాపారవేత్తను తొలిసారి పెళ్లాడింది. కొంత కాలం తర్వాత ఆ వ్యక్తి కుటుంబంపై కేసు పెట్టింది. కేసు రాజీలో భాగంగా రూ.75 లక్షలు అందుకున్నది. కాగా, 2017లో గురుగ్రామ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను సీమా వివాహం చేసుకున్నది. అతడి నుంచి విడిపోయిన ఆమె సెటిల్‌మెంట్‌గా రూ.10 లక్షలు తీసుకున్నది. ఆ తర్వాత 2023లో జైపూర్‌కు చెందిన వ్యాపారవేత్తతో సీమా పెళ్లి జరిగింది. అయితే ఆ వెంటనే రూ.36 లక్షల విలువైన బంగారు నగలు, నగదుతో అతడి ఇంటి నుంచి పారిపోయింది. వరుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సీమాను అరెస్ట్ చేశారు. మరోవైపు నిందితురాలు సీమాను 'లూటేరి దుల్హన్' (దోపిడీలకు పాల్పడుతున్న వధువు)గా జైపూర్ పోలీసులు అభివర్ణించారు. విడాకులు తీసుకున్న లేదా భార్యలను కోల్పోయిన ధనవంతులైన మగవారిని మ్యాట్రిమోనియల్ సైట్‌లలో వెతికి వారిని ఆమె టార్గెట్ చేస్తుందని తెలిపారు. పలు రాష్ట్రాల్లో ముగ్గురిని పెళ్లాడిన సీమా వారి నుంచి రూ.1.25 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తెలిసిందన్నారు.

70 గంటల పనిదినాలపై చర్చ..!

ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వ్యాఖ్యలను విభేదించిన ఎంపి కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటలు చొప్పున పని చేయాలం టూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాప కుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలపై చర్చ కొనసాగుతూనే ఉంది. తాజాగా ఆయన అభిప్రా యాన్ని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం విభేదిం చారు. సుదీర్ఘంగా పని చేయాలని చెప్ప డం అర్థరహితం అని, ముందు సమర్థతపై దృష్టిపెట్టాలని కౌంటర్ ఇచ్చారు. '70 పని గంటల విధానాన్ని సమర్థిస్తూ నారాయణ మూర్తి గత కొంతకాలంగా వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ కార్యక్రమంలో ఆయన మరోసారి ఈ అంశా న్ని ప్రస్తావించారు. 'భారత్ వారానికి ఆరు పనిదినాల నుంచి 5 రోజుల పనికి మారడంపై నేను తీవ్ర అసంతృప్తి గా ఉన్నా. వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై నాకు నమ్మకం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయులు విశ్రాంతి తీసుకోవడం కాదు త్యాగాలు చేయాలి. నేను ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకే ఆఫీసుకు వెళ్లి.. రాత్రి 8.40 గంటలకు బయటి కొస్తా. వారానికి ఆరున్నర రోజులు పనిచేస్తా' అని వ్యాఖ్యా నించారు. దీనిపై కార్తీ చిదంబరం స్పందిస్తూ.. మూర్తి అభిప్రాయంపై విమర్శలు గుప్పించారు. 'సుదీర్ఘంగా పనిచే యడం అనేది అర్థరహితం. దానికి బదులుగా సమర్థతపై దృష్టిపెట్టాలి. అసమర్థమైన, నాసిరకం మౌలిక సదుపాయా లు, సౌకర్యాలను ఎదుర్కొంటూ మన రోజువారీ జీవితం ఒక పోరాటంలా సాగుతోంది. మంచి సామాజిక క్రమం, సామరస్య పరిస్థితుల కోసం వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ అనేది చాలా ముఖ్యం. వాస్తవానికి మనం వారానికి 4 రోజుల పని విధానానికి మారాలి. సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల కల్లా పని ముగియాలి' అని కాంగ్రెస్ ఎంపీ వివరించారు.ఆ మధ్య ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'ది రికార్డ్' అనే పాడ్‌కాస్ట్ తొలి ఎపిసోడ్‌లో మాట్లాడిన నారాయణమూర్తి.. ప్రపంచదేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత తక్కువని అన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి.

భారీ నష్టాల నుంచి తేరుకున్న మార్కెట్లు

498 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్.. ఊపిరి పీల్చుకున్న మదుపరులు

ముంబై,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): గతవారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు సోమవారం కాస్త కోలుకున్నాయి. వరుస నష్టాల నుంచి బయటపడ్డాయి. దీంతో మదుపరులు కాస్తా ఊపిరి పీల్చుకున్నారు. గత వారం స్టాక్‌మార్కెట్లు మదుపర్లకు పీడకలను మిగిల్చాయి. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ఈ వారాన్ని సూచీలు పాజిటివ్‌గా ప్రారంభించాయి. ముఖ్యంగా లోహ, రియాల్టీ,÷నాన్సియల్ షేర్లు రాణించాయి. దీంతో సెన్సెక్స్ 498 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే లాభాలను ఆర్జించింది. గత శుక్రవారం ముగింపుతో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 450 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో 850 పాయింట్లకు పైగా లాభపడి 78, 918 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు మొదలవడంతో కాస్త ఒడిదుడుకులకు లోనైనా చివర్లో మళ్లీ కోలుకుంది. చివరకు 498 పాయింట్ల లాభంతో 78, 540 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 150 పాయింట్ల లాభంతో రోజును ప్రారంభించింది. చివరకు 165 పాయింట్ల లాభంతో 23, 753 వద్ద రోజును ముగించింది. సెన్సెక్స్‌లో సెయిల్, జిందాల్ స్టీల్, బంధన్ బ్యాంక్, జుబిలెంట్ ఫుడ్స్, మాక్రోటెక్ డెవలపర్స్ షేర్లు లాభాలు అందుకున్నాయి. నైకా, జొమాటో, కాన్‌ఫిన్ హోమ్స్, కేపీఐటీ టెక్నాలజీస్, దాల్మియా భారత్ షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 331 పాయింట్లు కోల్పోయింది. బ్యాంక్ నిఫ్టీ 558 పాయింట్లు లాభపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.13గా ఉంది.

ట్రైనీ ఐఎఎస్‌కు ముందస్తు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 23 (ఋషి ప్రతినిధి): మాజీ ఐఏఎస్ ట్రైనీ ఆఫీసర్ పూజా ఖేద్కర్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. అక్రమ రీతిలో యూపీఎస్సీ పరీక్షను ఆమె క్లియర్ చేసినట్లు ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ఓబీసీ, దివ్యాంగ కోటాలో లబ్ధి పొందేందుకు పూజా ఖేద్కర్ .. యూపీఎస్సీని తప్పుదోవ పట్టించినట్లు జస్టిస్ చంద్ర ధారి సింగ్ పేర్కొన్నారు. అర్హత లేకున్నా ఆమె ఆ కోటాలో లబ్ధి పొందినట్లు తెలిపారు. డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి ఐఏఎస్ శిక్షణకు ఎంపికైనట్లు సింగిల్ జడ్జి తెలిపారు. యూపీఎస్సీని మోసం చేయాలన్న ఉద్దేశం ఆమె ప్రయత్నంలో స్పష్టం కనిపిస్తున్నట్లు కోర్టు పేర్కొన్నది. వైకల్య సమస్యలు ఉన్నా వారి కోసం ఏర్పాటు చేసిన బినిఫిట్లను ఆమె పొందినట్లు కోర్టు తెలిపింది. ఆమె ఆర్థిక, సామాజిక బ్యాక్‌గ్రౌండ్ ఆధారంగా.. ఆమెకు పేరెంట్స్ కూడా సహకరించి ఉంటారని అంచనాకు వచ్చారు. కస్టడీలోనే ఆమెపై విచారణ కొనసాగాలని ధర్మాసనం తెలిపింది. యూపీఎస్సీ వ్యవస్థనే భ్రష్టుపట్టించే రీతిలో పూజా కుట్ర పన్నిందని, ఒకవేళ ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరీ చేస్తే, అది విచారణపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది. ప్రస్తుతం యూపీఎస్సీ ఆమె సెలక్షన్‌ను రద్దు చేసింది. భవిష్యత్తులో ఎటువంటి పరీక్ష రాయకుండా ఆమెను పర్మనెంట్‌గా డిమాండ్ చేశారు. యూపీఎస్సీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఖేద్కర్‌పై కేసు బుక్ చేశారు. అరెస్టు చేయవద్దు అని ఆగస్టు 12వ తేదీన తాత్కాలిక రక్షణ కల్పించారు. కానీ తాజా ఆదేశాలతో ఆ తీర్పును రద్దు చేయాల్సి ఉంటుంది.

నో డిటెన్షన్ విధానం ఎత్తివేత

కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,డిసెంబర్23 (ఋషి ప్రతినిధి): నో డిటెన్షన్ విధాన్నాన్ని ఎత్తివేస్తూ..పాఠశాల విద్యకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసింది. దీంతో ఇకపై వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని 5, 8 తరగతుల విద్యార్థులు మళ్లీ అదే తరగతిలో చదవాల్సిఉంటుంది. విద్యాహక్కు చట్టం- 2019కు చేసిన సవరణ ప్రకారం దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాలు అందులో తెలుగు రాష్ట్రాలు మినహా, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు ఇప్పటికే ఈ రెండు తరగతులకు నో డిటెన్షన్ విధానాన్ని తొలగించాయని కేంద్రం పేర్కొంది. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. పరీక్షల్లో విద్యార్థి పైతరగతులకు ప్రమోట్ కావడంలో విఫలమైతే.. మళ్లీ పరీక్ష రాసేందుకు కొంత సమయం ఇస్తారు. ఫలితాల ప్రకటన తేదీకి రెండు నెలల్లోపే మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఒకవేళ రీ-ఎగ్జామ్‌లోనూ ఫెయిల్ అయితే.. సదరు విద్యార్థులు మళ్లీ ఆయా తరగతుల్లోనే చదవాల్సి ఉంటుంది. ప్రాథమికోన్నత విద్య పూర్తయినంత వరకు ఏ విద్యార్థినీ బహిష్కరించరాదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నోటిఫికేషన్ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని దాదాపు 3వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక్ పాఠశాలలకు వర్తిస్తుందని కేంద్ర విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం గనక ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవచ్చు. ఇప్పటికే 16 రాష్ట్రాలు ఢిల్లీ సహా రెండు కేంద్రపాలిత ప్రాంతాలు ఈ రెండు తరగతుల విద్యార్థులకు నో డిటెన్షన్ పాలసీని రద్దు చేశాయని సదరు అధికారి పేర్కొన్నారు. హరియాణా, పుదుచ్చేరి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. మిగతా రాష్ట్రాలు మాత్రం ఈ విధానాన్నే కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు అధికారి తెలిపారు. నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్రం డిటెన్షన్ విధానం పై గతంలో రాష్ట్రాల నుంచి అభిప్రాయాలను కోరింది. ఇక మన తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. ఇక్కడ 'నో డిటెన్షన్ విధానం' కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఇసారి ఆ తప్పు జరగదు: ప్రశాంత్‌నీల్

ప్రభాస్ 'సలార్' సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 700కోట్ల వసూళ్లను రాబట్టిన విషయం తెలిసిందే. ఈ సినిమా చివర్లో దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్ 2 శౌర్యాంగపర్వం'ను కూడా ప్రకటించేశాడు. దాంతో అభిమానులు సెకండ్ పార్ట్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వారందరికోసం 'సలార్ 2' అప్‌డేట్‌ని ఇచ్చేశారు ప్రశాంత్‌నీల్. ఆయన మాట్లాడుతూ ' 'సలార్' భారీ విజయాన్ని సాధించినా.. ఒక దర్శకుడిగా ఆ సినిమా విషయంలో పూర్తి సంతృప్తిగా లేను. ఎక్కడో 'కేజీఎఫ్' ఛాయలు ఆ సినిమాలో కనిపిస్తుంటాయి. 'సలార్ 2 శౌర్యాంగపర్వం'లో మాత్రం ఆ తప్పు జరగదు. ఓ కొత్త సినిమాను ప్రేక్షకులు చూస్తారు.' అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ 'ఈ కథ రాసుకున్నప్పుడే రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే ఇది దేవా– వరదా అనే ఇద్దరు స్నేహితుల కథ. మలుపులు, కుదుపులు లేకపోతే కథ రక్తికట్టదు. స్నేహం సాఫీగా సాగితే కిక్కుండదు. అందుకే.. కష్టమైనా సరే.. వారిద్దర్నీ విడగొట్టాలి.

శ్రీతేజ్‌ను పరామర్శిస్తున్న ప్రముఖులు

సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ని సోమవారం ప్రముఖ సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి పరామర్శించారు. తెల్లవారితే పుష్ప-2 సినిమా విడుదలవుతుందనగా.. డిసెంబర్ 4వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రీమియర్ షో వేయడం, ఆ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో దిల్‌సుఖ్ నగర్‌కు చెందిన రేవతి(35) మృతి చెందడం, ఆమె కుమారుడు శ్రీతేజ్ (9) అపస్మారక స్థితికి చేరుకొని చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. సినిమా ఈ నేపథ్యంలో ప్రముఖ సినీ, రాజకీయ ప్రముఖులు శ్రీతేజ్ చికిత్స పొందుతున్న కిమ్స్ ఆసుపత్రికి క్యూ కట్టారు. తాజాగా ప్రముఖ నటుడు ఆర్. నారాయణమూర్తి సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్ కి చేరుకున్నారు. బాలుడి ఆరోగ్యస్థితిపై అరా తీశారు. రేవతి భర్త భాస్కర్ కి ధైర్యం చెప్పారు. ఇప్పటికే 'పుష్ప 2' టీమ్ నుండి సుకుమార్, జగపతి బాబు, మైత్రీ నిర్మాతలు కలిశారు. వీరితో పాటు అల్లు అరవింద్, బన్నీ వాసులు కూడా కలిసి అండగా ఉంటాం అని భరోసానిచ్చారు. మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి టాలీవుడ్ చిత్ర పరిశ్రమకి చెందిన సెలబ్రిటీలపై మండిపడిన విషయం తెలిసిందే. ఆయన మాట్లాడుతూ.. "బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ఎవరూ ఆసక్తి చూపించలేదు. కానీ అల్లు అర్జున్ కోసం క్యూ కట్టిన సినీ ప్రముఖులు బాధితులను పరామర్శించడానికి ముందుకు రాలేదు.

డాకు మహారాజ్ బాగా తీశాడు

సినిమా విడుదల సమయంలో సెన్సేషనల్ కామెంట్స్ చేసే నిర్మాత సూర్యదేవర నాగవంశీ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మెగాస్టార్ అభిమానులు తిట్టుకున్నా ఫర్వాలేదు. కానీ దర్శకుడు బాబీ 'వాల్తేరు వీరయ్య' కంటే 'డాకు మహారాజ్' సినిమాని బాగా తీశాడు' అని కామెంట్స్ చేశాడు. ఈ విషయంలో చిరంజీవి ఫ్యాన్స్ తనని తిట్టుకున్నా పర్లేదని స్టేట్ మెంట్ ఇచ్చారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాగవంశీ ఈ వ్యాఖ్యలు చేశారు. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో నాగవంశీ నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. బాబీ దేవోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే జనవరి 4న అమెరికాలో ఓ ఈవెంట్ ప్లాన్ చేశారు. మరో ఈవెంట్ విజయవాడలో నిర్వహిస్తామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ " బాలకృష్ణతో వర్క్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. ఇప్పటికి కుదిరింది. ఈ సినిమాలో ఆయన్ని చాలా కొత్తగా చూస్తారు. ఇప్పటివరకు ఏ సినిమాలోనూ ఇలాంటి లుక్‌లో ఆయన కనిపించలేదు. అఖండ, లెజెండ్ గురించి ఎలా చెప్పుకుంటున్నారో దీని గురించి కూడా అలానే మాట్లాడుకుంటారు. సినిమా ఇంటర్వెల్‌లోనే నాకు ఫోన్ చేసి ఈ మాట చెబుతారు.

సీఎం నిర్ణయంతో సింగిల్ స్క్రీన్లు బతికిపోయాయి: ఎగ్జిబిటర్లు

రానున్న రోజుల్లో బెనిఫిట్ షోలు, టికెట్ ధరలు పెంపునకు అనుమతి ఇచ్చేది లేదని తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సోమవారం ఎగ్జిబిటర్స్ సమావేశం జరిగింది. ఒక్కో సినిమాకు ఒక్కోరకంగా టికెట్ ధరలు పెంచడం వల్ల సగటు ప్రేక్షకుడు ఇబ్బంది పడుతున్నాడని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అభిప్రాయపడింది. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీ ఎగ్జిబిటర్లు కూడా స్వాగతించారు. ఏపీ ప్రభుత్వం కూడా దీనిపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ జరిగింది. అనంతరం ఎగ్జిబిటర్లు మాట్లాడుతూ "కొత్త సినిమా విడుదలైన రెండు, మూడు రోజులు అభిమానులు, కాలేజ్ స్టూడెంట్స్ యువత, మాస్ ఎక్కువగా చూస్తారు. టికెట్ ధరలు పెంచి, వారి నుంచి అత్యధిక వసూళ్లు చేయడం బాధాకరంగా ఉంది. అన్ని సినిమాలకు నిర్దిష్ట మొత్తంలోనే టికెట్ ధరలు ఉండేలా చూడాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్‌రాజును కోరాం. ఈ క్రమంలో సీఎం రేవంత్, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రీమియర్ షోల పేరిట రూ.1200 టికెట్ ధర పెడితే, అదే ధర ఉంటుందని చాలా మంది అనుకుంటున్నారు.

క్రికెట్‌కు సచిన్‌లా.. సినిమాకు శంకర్ అలా: రామ్‌చరణ్

శంకర్‌గారు కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా. క్రికెట్‌కు సచిన్ ఎలాగో, ఇండియన్ సినిమాకు శంకర్‌గారు అలా. అలాంటి శంకర్‌గారితో పనిచేయడం నా అదృష్టం. నానుంచి సోలో ఫిల్మ్ వచ్చి అయిదేళ్లయింది. ఇది నాకు ప్రత్యేకమైన సినిమా. ఈ మూవీ ఏ ఒక్కర్నీ నిరాశపరచదు.' అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఎస్.శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా సినిమా జనవరి 10న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ అమెరికా డల్లాస్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి అగ్ర దర్శకుడు సుకుమార్ అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "రంగస్థలం'కు రామ్‌చరణ్ జాతీయ అవార్డు తీసుకుంటాడని ఆశించా. కానీ రాలేదు. అయితే.. 'గేమ్ చేంజర్' ట్రక్లైమాక్స్ చూశాక, ఈ సినిమాలోని రామ్‌చరణ్ నటనకు పక్కాగా జాతీయ అవార్డు వస్తుందనిపించింది.' అని తెలిపారు. 'మా సంస్థలో ఇది 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్ సినిమా తీయడం ఇదే ప్రథమం. శంకర్‌గారి సినిమా సెల్‌ఫోన్‌లో చూస్తే ఫీల్ రాదు. దాన్ని బిగ్ స్క్రీన్‌పైనే ఎక్స్‌పీరియన్స్ చేయాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ అంశాలు ఈ సినిమాలో చాలా కనిపిస్తాయి. శంకర్‌గారు అన్నీ తానై నడిపించారు. ఈసారి మామూలుగా కొట్టడంలేదు. గట్టిగా కొట్టబోతున్నాం.' అని దిల్‌రాజు నమ్మకం వ్యక్తం చేశారు. శంకర్ మాట్లాడుతూ 'పోకిరి, ఒక్కడు లాంటి మాస్ మసాలా సినిమా చేయాలి.. కానీ అందులో కూడా నా మార్క్ ఉండాలి అనుకొని ఈ 'గేమ్‌ఛేంజర్' చేశాను. ప్రభుత్వోద్యోగి, పొలిటీషియన్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా. రామ్‌చరణ్ సెటిల్డ్‌గా చేశాడు. పంచెకట్టులో అప్పన్నగా అదరగొట్టేశాడు.

గూగుల్ సెర్చింగ్‌లో నెం. 1 త్రిప్తి

'యానిమల్'కి ముందు కూడా త్రిప్తి డిమ్రీ సినిమాలు చేసింది. కానీ గుర్తింపు రాలేదు. కానీ 'యానిమల్' తర్వాత రాత్రికి రాత్రి స్టార్ అయి కూర్చుంది. రీసెంట్‌గా ఈ అందాలభామ మరో అఛీవ్‌మెంట్ కూడా సాధించింది. బాలీవుడ్‌లో తన తోటి హీరోయిన్లందర్నీ వెనక్కు నెట్టి నంబర్‌వన్‌గా నిలిచింది. ఇది ఎలా సాధ్యం? అనుకుంటున్నారా!.. అసలు విషయం ఏంటంటే.. అసలే బాలీవుడ్‌లో స్టార్ట్ తాకిడి ఎక్కువ. వారందరినీ దాటుకొని గూగుల్ సెర్చ్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది త్రిప్తి డిమ్రీ. ఇది కూడా తక్కువ విషయమేం కాదు. ఈ పరిణామంపై తెగ సంబరపడిపోతున్నది ఈ అందాలభామ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'నా గురించి తెలుసుకోవాలని ఇంతమంది ఉత్సాహపడ్డారంటే అది నిజంగా నా విజయమే. ఈ క్రేజ్‌కి కారణం 'యానిమల్'. థ్యాంక్యూ సందీప్ సార్. 'యానిమల్ 2' కోసం ఎదురు చూస్తున్నా. అందులోనూ అందరూ మెచ్చేలా నా పాత్ర ఉంటుంది.' అంటూ చెప్పుకొచ్చింది త్రిప్తి డిమ్రీ.

కాంబ్లీ ఆరోగ్యం విషమం

టీమిండియా మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఆరోగ్యం మళ్లీ విషమించింది. గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయనను శనివారం రాత్రి కుటుంబ సభ్యులు మళ్లీ ఆసుపత్రిలో చేర్పించారు. థానేలోని ఆకృతి ఆసుపత్రిలో చేరిన వినోద్ కాంబ్లీ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం కఠింగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే తన చిన్ననాటి సచిన్ టెండూల్కర్‌ను కలుసుకున్న 52 ఏళ్ల వినోద్ కాంబ్లీ.. అతని అపార్థం చేసుకున్నానని మీడియాకు తెలిపారు. తమ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ మెమోరియల్ కార్యక్రమంలో సచిన్‌ను కాంబ్లీ కలుసుకున్నారు. ఈ ఈవెంట్‌లో కాంబ్లీ వీల్‌చైర్‌లో కనిపించడంతో అభిమానులు, సహచర ఆటగాళ్లు ఆందోళనకు గురయ్యారు. కాంబ్లీ తీవ్ర అనారోగ్యానికి గురవ్వడం ఇదే తొలి సారి కాదు. గతంలో ఆయన అనేక సమస్యలను ఎదుర్కొన్నారు. కానీ ఈసారి ఆయనకు ఆర్థిక సాయం చేసేందుకు 1983 వరల్డ్ కప్ జట్టు సభ్యులు ముందుకు వచ్చారు. అయితే ఇందుకు వారు ఓ కండిషన్ పెట్టారు. తాగుడు మానేసి రిహాబిలిటేషన్ సెంటర్‌కు వెళ్తానంటేనే సాయం చేస్తామని చెప్పారు. అందుకు కాంబ్లీ అంగీకరించాడు. తనకు వచ్చే పెన్షన్‌తో కాలం వెల్లదీస్తున్నానని, తన కుటుంబ సభ్యులు ఎంతో చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అజయ్ జడేజా తనకు మంచి మిత్రుడని, ఇటీవల తనకు చూడడానికి కూడా వచ్చాడని, 'కమాన్ గెటప్' అంటూ తనను ఉత్సాహపరిచాడని కాంబ్లీ గుర్తుచేసుకున్నారు. ఆలస్యంగానైనా చాలా మంది ఇప్పుడు తనను చూడడానికి వస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. బీసీసీఐ కూడా తనకు అండగా నిలుస్తుందని , అజెయ్ కురువిల్ల (మాజీ ఇండియన్ పేసర్) కూడా బీసీసీఐతో ఉన్నారని, తనతోనూ, తన భార్యతోనూ ఆయన ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారని కాంబ్లీ చెప్పుకొచ్చారు. సచిన్ తనకు ఎప్పుడూ ఏమీ చేయలేదని అపార్థం చేసుకున్నానని చెప్పారు. గతంలో తనకు జరిగిన రెండు సర్జరీలకు సచినే సాయం చేశాడనే విషయం తర్వాత తెలిసిందన్నారు. తమ స్నేహం ఎప్పటిలాగే ఉందని చెప్పుకొచ్చారు.



మూడోసారి 600కు పైగా పరుగులు

అద్భుతమైన ఫామ్‌లో స్మృతి మందాన

స్మృతి మంధాన ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన మొదటి %ణ×%లో 91 పరుగుల ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో వరుసగా ఐదవ ఫిఫ్టీ ప్లస్ స్కోర్ కావడం గమనార్హం. ఈ కాలంలో ఆమె స్కోర్లు- 91, 77, 62, 54, 105లుగా నిలిచాయి. స్మృతి మంధాన తన ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో 2024లో 600కు పైగా వన్డే పరుగులు పూర్తి చేసింది. ఒక క్యాలెండర్ ఇయర్‌లో మూడోసారి 600కు పైగా పరుగులు చేసిన తొలి భారతీయ మహిళా క్రికెటర్‌గా ఆమె నిలిచింది. ఈ ఏడాది టీ20 ఇంటర్నేషనల్‌లో 600పైగా పరుగులు కూడా చేసింది. 2018లో కూడా రెండు ఫార్మాట్లలో ఇలా చేయడం గమనార్హం. స్మృతి మంధాన 2024లో అంతర్జాతీయంగా 1602 పరుగులు చేసింది. దీని ద్వారా మహిళల క్రికెట్‌లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక అంతర్జాతీయ పరుగులు చేసిన క్రీడాకారిణిగా సరికొత్త రికార్డు సృష్టించింది. 2024లోనే 1593 పరుగులు చేసిన దక్షిణాఫ్రికాకు చెందిన లారా వూల్‌వర్డ్ రికార్డును బద్దలు కొట్టింది. స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో 50 ప్లస్ 71 సార్లు స్కోర్ చేసింది. అలాగే, ఇతర ఎడమచేతి వాటం కలిగిన భారతీయ క్రికెటర్లందరూ అంతర్జాతీయ క్రికెట్‌లో 78 సార్లు యాభై ప్లస్ స్కోర్లు సాధించారు. మహిళల క్రికెట్‌లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన టాప్-5 జాబితాలో స్మృతి మంధాన పేరు మూడుసార్లు కనిపిస్తుంది. అంతకుముందు 2018లో 1291 పరుగులు, 2022లో 1290 పరుగులు చేసింది. స్మృతి మంధాన మహిళల వన్డేలో తొంభైలలో ఆరోసారి ఔట్ అయింది. ఈ విషయంలో ఆమె ఆస్ట్రేలియాకు చెందిన అలిస్ పెర్రీని సమం చేసింది. భారతీయుల్లో మంధాన తర్వాత ఇలా ఐదుసార్లు చేసిన లిస్టులో మిథాలీ రాజ్ ఉంది. 2024లో భారత్ తరపున స్మృతి మంధాన అత్యధికంగా 1602 పరుగులు చేసింది. ఆమెకు ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. దీని ద్వారా ఆమె ఈ సంఖ్యను మరింత ముందుకు తీసుకెళ్లవచ్చు. 868 పరుగులు చేసిన షెఫాలీ వర్మ పేరు భారతీయుల్లో తర్వాతి స్థానంలో ఉంది.

అద్భుత ఫామ్‌లో బుమ్రా

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఇప్పటివరకు అందరి వాదనలు తప్పని టీమిండియా నిరూపించి సిరీస్‌ను 1-1తో సమంగా ఉంచుకుంది. ఈ సిరీస్‌లో మూడు టెస్టు మ్యాచ్‌లు పూర్తయినా ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు ఆధిక్యం సాధించలేకపోయింది. దీనికి అతిపెద్ద కారణం టీమ్ ఇండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా. అతను ఆస్ట్రేలియాను దాదాపు ఒంటరిగా ఎదుర్కొన్నాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు బుమ్రా అత్యధిక వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు అతను మెల్‌బోర్న్‌లో జరిగే నాల్గవ టెస్ట్ మ్యాచ్‌లో తన పాత రికార్డును మార్చగలడు. ఒక సంవత్సరంలో 80 వికెట్లకు పైగా తీసిన రికార్డ్ బుమ్రా ఖాతాలో చేరింది. బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్ డిసెంబర్ 26 నుంచి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభం కానుంది. టెస్టు సిరీస్ గమనాన్ని నిర్ణయించడంలో ఈ మ్యాచ్ కీలక పాత్ర పోషిస్తుంది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో వైట్‌వాష్‌కు గురైన అవమానాన్ని ఎదుర్కొని ఈ టూర్‌కు వచ్చిన టీమిండియా ఇప్పటివరకు ఊహించిన దానికంటే మెరుగైన ప్రదర్శన కనబరిచింది. ఇందులో హీరోగా బుమ్రా నిలిచాడు. బుమ్రా విధ్వంసక బౌలింగ్‌తో సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లోనే ఆధిక్యం సాధించి ఆస్ట్రేలియాకు షాకిచ్చాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా బలమైన పునరాగమనం చేసినా ప్రస్తుతం సిరీస్ సమమైంది. మెల్‌బోర్న్ టెస్టులో బుమ్రా కనీసం 3 వికెట్లు తీస్తే, తొలిసారిగా ఏడాదిలో 80 అంతర్జాతీయ వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది మొత్తం మూడు ఫార్మాట్లలో కలిపి 32 ఇన్నింగ్స్‌ల్లో బుమ్రా మొత్తం 77 వికెట్లు తీశాడు. అంతకుముందు 2018లో, అతను 39 ఇన్నింగ్స్‌లలో 78 వికెట్లు తీసుకున్నాడు. ఇది ఇప్పటి వరకు అతని అత్యుత్తమ ప్రదర్శనగా మారింది. ఈ ఏడాది టెస్టుల్లో బుమ్రా 24 ఇన్నింగ్స్‌ల్లో 62 వికెట్లు తీయగా, 8 టీ20 ఇన్నింగ్స్‌ల్లో 15 వికెట్లు తీశాడు. మెల్‌బోర్న్ టెస్టులో బుమ్రా కనీసం 3 వికెట్లు తీస్తే, తొలిసారిగా ఏడాదిలో 80 అంతర్జాతీయ వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది మొత్తం మూడు ఫార్మాట్లలో కలిపి 32 ఇన్నింగ్స్‌ల్లో బుమ్రా మొత్తం 77 వికెట్లు తీశాడు. అంతకుముందు 2018లో, అతను 39 ఇన్నింగ్స్‌లలో 78 వికెట్లు తీసుకున్నాడు. ఇది ఇప్పటి వరకు అతని అత్యుత్తమ ప్రదర్శనగా మారింది. ఈ ఏడాది టెస్టుల్లో బుమ్రా 24 ఇన్నింగ్స్‌ల్లో 62 వికెట్లు తీయగా, 8 టీ20 ఇన్నింగ్స్‌ల్లో 15 వికెట్లు తీశాడు. ప్రస్తుతం బుమ్రా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు.

రసవత్తరంగా డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) 2025 ఫైనల్ రేసు రసవత్తరంగా మారింది. ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో సౌతాఫ్రికా 63.33 విజయాల శాతంతో అగ్రస్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా(58.89), భారత్(55.88)తో రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్‌కు సౌతాఫ్రికా అడుగు దూరంలో నిలిచింది. మరో మ్యాచ్ గెలిస్తే సఫారీ టీమ్ అధికారికంగా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుతోంది. డబ్ల్యూటీసీ 2023-25 సైకిల్‌లో ఆ జట్టుకు ఇంకా రెండే మ్యాచ్‌లు ఉన్నాయి. పాకిస్థాన్‌తో సొంతగడ్డపై రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ సిరీస్‌లో ఒక్క మ్యాచ్ గెలిచినా సౌతాఫ్రికా ఫైనల్ చేరుతోంది. అయితే ఈ రెండు మ్యాచ్‌ల్లో పాకిస్థాన్‌ను సౌతాఫ్రికా ఓడిస్తే మాత్రం ఆ జట్టు ఫైనల్ రేసు నుంచి తప్పుకుంటుంది. ప్రస్తుతం సౌతాఫ్రికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్.. మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. తద్వారా సఫారీ గడ్డపై వన్డే సిరీస్ క్లీన్ స్వీప్ చేసిన తొలి జట్టుగా పాకిస్థాన్ చరిత్రకెక్కింది. వన్డే సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడంతో.. టెస్ట్ సిరీస్ కూడా క్లీన్ స్వీప్ చేస్తుందనే ప్రచారం జోరందుకుంది. టెస్ట్ సిరీస్‌లో సౌతాఫ్రికా రెండు మ్యాచ్‌లు ఓడితే ఆ జట్టు విన్నింగ్ పర్సంటేజీ 52.78కి పడిపోతుంది. అప్పుడు ఫైనల్ చేరేందుకు భారత్‌కు మార్గం సుగమమవుతోంది. ప్రస్తుతం భారత్-ఆస్ట్రేలియా ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూడు మ్యాచ్‌లు ముగియగా ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1-1తో సమంగా ఉన్నాయి. మూడో టెస్ట్ డ్రా అయ్యింది. చివరి రెండు టెస్ట్‌లను భారత్ గెలిచి 3-1తో సిరీస్

కృనాల్, విష్ణు సోలంకి అద్భుత ఇన్నింగ్స్

విజయ్ హజారే ట్రోఫీలో బరోడా జట్టు అద్భుతాలు సృష్టించింది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో కృనాల్ పాండ్యా సారథ్యంలోని ఈ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 403 పరుగులు చేసింది. బరోడా తరపున 25 ఏళ్ల యువ ఓపెనర్ నినాద్ రథ్వా అద్భుత సెంచరీ చేయగా, పార్థ్ కోహ్లి, కృనాల్ పాండ్యా హాఫ్ సెంచరీలతో చెలరేగడం విశేషం. బరోడా జట్టు మొత్తంగా 14 సిక్సర్లు, 37 ఫోర్లతో కేరళ బౌలర్లను ఉతికిఆరేసింది. ఈ సీజన్‌లో తొలిసారిగా ఓ జట్టు స్కోరు 400 దాటడం గమనార్హం. తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా వేగంగా పరుగులు చేసేందుకు ప్రయత్నించింది. కానీ ఈ ప్రయత్నంలో శాశ్వత్ రావత్ 10 పరుగులకే అవుటయ్యాడు. దీని తర్వాత పార్థ్ కోహ్లితో కలిసి ఓపెనర్ నినాద్ రథ్వా 160 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి కేరళను చిత్తు చేశాడు. నినాద్ రథ్వా 99 బంతుల్లో 136 పరుగులు చేశాడు. అతడు బ్యాట్‌తో 3 సిక్సర్లు, 19 ఫోర్లు బాదాడు. మరోవైపు పార్థ్ కోహ్లి 87 బంతుల్లో 72 పరుగులు చేశాడు. అతని బ్యాట్‌తో 3 సిక్స్‌లు, 3 ఫోర్లు వచ్చాయి. కృనాల్ పాండ్యా, విష్ణు సోలంకి అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. పాండ్యా 54 బంతుల్లో 80 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ బరోడా కెప్టెన్ తన ఇన్నింగ్స్‌లో 3 సిక్సర్లు, 7 ఫోర్లు కొట్టాడు. సోలంకి 3 సిక్సర్లు, 3 ఫోర్లు రాబట్టాడు. చివర్లో, భాను పునియా కూడా 15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 37 పరుగులతో చెలరేగాడు. దీంతో బరోడా జట్టు నిర్ణీత ఓవర్లకు భారీ స్కోర్ సాధించగలిగింది. కృనాల్ పాండ్యా గత మ్యాచ్‌లో ఫ్లాప్ అయ్యాడు, అతడు 33 బంతుల్లో కేవలం 13 పరుగులు చేయగలిగాడు. కానీ ఈసారి అద్భుతంగా పునరాగమనం చేశాడు. గత మ్యాచ్‌లో బరోడా 92 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లోనూ బరోడా 302 పరుగులు చేసింది.

ఫోర్లు, సిక్సర్లతో రుతురాజ్ తాండవం

భారత క్రికెట్‌లో లిస్ట్ ఏ ఫార్మాట్‌లో విజయ్ హజారే ట్రోఫీ అతిపెద్ద టోర్నమెంట్.. ఈ టోర్నీ ద్వారానే భారత వన్డే జట్టులో చోటు దక్కించుకుంటూ ఉంటారు. 38 జట్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీని క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. సోమవారం మహారాష్ట్ర, సర్వీసెస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఓ ఇన్నింగ్స్ అందరినీ అవ్వాక్కయేలా చేసింది. ఈ ఇన్నింగ్స్ ఆడింది.. మహారాష్ట్ర జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్.. ఈ మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ ఫోర్లు, సిక్సర్లతో విలయతాండవం చేశాడు. తన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఇరు జట్ల మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బౌలర్లు అతని నిర్ణయం సరైనదని నిరూపించారు.

తొలుత బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ జట్టు 48 ఓవర్లు మాత్రమే ఆడి 204 పరుగులకు ఆలౌటైంది. సర్వీసెస్ తరఫున కెప్టెన్ మోహిత్ అహ్లావత్ అత్యధికంగా 61 పరుగులు చేశాడు. అతను తప్ప మరే ఇతర బ్యాట్స్‌మెన్ కూడా 30 పరుగుల మార్కును దాటలేకపోయారు. మరోవైపు మహారాష్ట్ర జట్టులో ప్రదీప్ దాధే, సత్యజిత్ బచావ్ గరిష్టంగా 3-3 వికెట్లు తీశారు. మహారాష్ట్ర జట్టుకు 205 పరుగుల లక్ష్యాన్ని సర్వీసెస్ ఇచ్చింది. కానీ రితురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్ ముందు చిన్నదిగా కనిపించింది. ఓపెనింగ్ వచ్చిన రితురాజ్ గైక్వాడ్ చాలా వేగంగా పరుగులు చేశాడు.



తవ్వితే.. 125 గుళ్లు!

అది ఒక రామాలయం..
అందులో చికెట్, మటన్ బిర్యానీలు వండారు..!
అది ఒక శివాలయం..
ఆ గుడి నిండా చెత్తాచెదారాన్ని పోశారు..!
కొన్ని గుళ్లను ఇళ్లుగా మార్చారు..
మరికొన్నింటిని దుకాణాలుగా మార్చేశారు..!
అలా ఒకటి కాదు.. రెండు కాదు..
మొత్తంగా 125 గుళ్లను పాడుచేశారు..!

కేంద్ర మంత్రి బండి సంజయ్ గతంలో ఒక మాట అన్నారు..! "మసీదులు తవ్వుదాం.. శవాలు వస్తే మీవి.. శివలింగాలు వస్తే మావి" అని. ఆయన అన్న ఆ మాట రాజకీయంగా ప్రకంపనలు పుట్టించింది. విద్వేషపు ప్రసంగాలు అని కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. ఆ మాట కొందరిలో కోపాన్ని రగిల్చింది. మరికొందరిలో ఆలోచనలు పుట్టించింది. కానీ, ఆ తర్వాత దేశవ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలు మాత్రం ఆయన మాటను వెయ్యి రెట్లు బలపరుస్తున్నాయి. అయోధ్య రామమందిరం కొలువుదీరిన తర్వాత దేశంలోని అనేక చోట్ల ఆలయాలు.. మసీదులుగా మారిపోయిన ఉదంతాలను హిందువులు గుర్తుచేసుకుంటున్నారు. అదే సమయంలో జ్ఞానవాపిలో, మథురలో, సంభాల్‌లో దేవాలయాలు బయటపడటం హిందువుల ఆలోచనలను కొత్త దారివైపు పయనించేలా చేస్తున్నదనటంలో ఎలాంటి సందేహం లేదు. ఏంటి? ఏ మసీదు తవ్వినా.. హిందూ ఆలయాలు బయటపడుతున్నాయేంటి? అన్న సందేహం మొదలైంది. ఈ ప్రశ్నల్లోంచే మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. కాన్పూర్‌లో 125 దేవాలయాలు బయటపడటం. నమ్మటానికి ఆశ్చర్యకరంగా ఉన్నా.. కాన్పూర్ మేయర్ ప్రమీలా పాండే స్వయంగా చెప్పిన నిజమిది. ముస్లిం ప్రజలు అధికంగా ఉండే కాన్పూర్‌లోని బెకన్‌గంజ్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని ఆమె ఆదేశించగా.. దాదాపు 7 పోలీస్ స్టేషన్ల కు చెందిన పోలీసు బలగాలు రంగంలోకి దిగగా.. ఒక్కొక్కటిగా 125 ఆలయాలు బయటపడ్డాయి.

కొన్ని దేవాలయాలు ఇళ్లుగా మారిపోగా, ఇంకొన్ని ఆలయాలను వ్యాపార సంస్థలుగా మార్చినట్లు తెలిసింది. దశాబ్దాల క్రితం ప్రతి పది ఇళ్లకు మధ్యలో ఒక దేవాలయం.. అలా వందల ఆలయాలు ఉండేవని, కానీ ఏ ఒక్కటీ ఇప్పుడు కనిపించకుండా పోవటం గమనార్హం. రామజానకి ఆలయంలో చికెన్, మటన్ బిర్యానీ వండినట్లు తేలింది, ఒక శివాలయాన్ని చెత్త కుప్పగా మార్చినట్లు గుర్తించారు. కొన్ని ఆలయాల్లో విగ్రహాలు మాయం కాగా, మరికొన్ని గుళ్లు నామరూపాల్లేకుండా పోయాయి. ఇప్పుడు ఆ ఆలయాలను పునరుద్ధరించే పనిలో ప్రమీలా పాండే నిమగ్నమయ్యారు. అక్రమంగా చెరబట్టిన ఆలయాలను వదిలేసి వెళ్లిపోవాలని అక్కడి ప్రజలకు ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి ప్రతి ఆలయంలో నిత్య పూజలు జరుగుతాయని స్పష్టం చేశారు. అవసరమైతే బుల్డోజర్ల ను కూడా దించుతామని తేల్చి చెప్పారు. ప్రస్తుతం కాన్పూర్ అంశం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఓవైపు జ్ఞానవాపి, మరోవైపు మథుర, ఇంకోవైపు సంభాల్, ఈ వైపు కాన్పూర్.. ఇలా ఏ చోట వెతికినా ఆ చోట హిందూ ఆలయాలే కనిపిస్తుండటం యావత్తు దేశాన్ని విస్మయపరుస్తున్నది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిస్థితి అదుపుతప్పుతుందని సుప్రీం కోర్టు అప్రమత్తమై.. ప్రార్థనా స్థలాల చట్టాన్ని గుర్తుచేసింది. మతపరమైన పిటిషన్లు తీసుకోవద్దని అన్ని కోర్టులను ఆదేశించింది. చట్టం తన పరిధిలో చేయాల్సినవి చేస్తున్నా.. హిందువుల మనోభావాల సంగతి ఏంటి? అన్న ప్రశ్న అనేక సమాధానాలను వెతకాలని నొక్కి చెప్తోంది. చూడాలి మరి.. పునాది రాళ్లలో చిక్కుకుపోయిన చరిత్ర ఇంకెంత దాగుందో..!



హిందువులారా లేవండి..!

ఇతర మతస్థుల ప్రచారం మీ ఇంటిగేటు, మీ గుడి వరకూ వచ్చేసింది.

కొంతకాలంగా ఓట్లు, సీట్ల కోసం పార్టీలు, ప్రభుత్వాలు ఎవరు శక్తి ప్రదర్శన చేస్తే వారికి జిందాబాద్ అంటున్నాయి.

హిందు జనాభా ఎక్కువ ఉన్నా, మన గుడులు వాటి ఆస్తులు ఇతర మతాల కోరికలు తీర్చడం కోసం వాడుతున్నాయి.

ఇకనైనా మనం హిందువులం మారాలి, మేలుకోవాలి. '2025 జనవరి 5వ తేదీ ఆదివారం' రోజున గన్నవరం విమానాశ్రయం సమీపంలో జరిగే హైందవ శంఖారావం ప్రదర్శన సభలో మనం, మన కుటుంబాలు, మన స్నేహితులతో కలిసి పాల్గొందాం.

హిందువుల సమైక్య శక్తి ప్రదర్శన చేసి రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు దేవాలయాలను హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించేట్లు చేద్దాం.

దేవాలయాలు హిందువుల కోసమే. ప్రభుత్వం చేతుల్లో ఉన్న దేవాలయాల నిర్వహణ హిందూ ధార్మిక సంస్థలకు అప్పచెప్పాలి. హిందూధర్మం వర్ధిల్లాలి.

- విశ్వహిందూ పరిషత్తు, ఆంధ్రప్రదేశ్

తొమ్మిది రుణాలు

రుణం అంటే.. తన ధర్మాన్ని తాను సరిగా నిర్వర్తిస్తున్నా చాలా మంది కష్టనష్టాలు పడుతూ ఉంటారు. ఒక్కో సారి జాతక రీత్యా దశ, అంతర్థశలను అనుసరించి జపం, దానాలు వంటివి ఎన్నో పరిహారాలు అనుసరించి చేయించినా పెద్దగా ఫలితం కనిపించక రకరకాల ఇబ్బందులు పడుతున్నారు. అందుకు కారణం రుణాలు. అంటే అప్పులు కాదు. ఆ రుణాలు: పితృ రుణం. మాతృరుణం , పుత్రికా రుణం , స్త్రీ రుణం, సోదర రుణం , దైవ రుణం , ఋషి రుణం , దాన నేణం, గురు రుణం. ఈ తొమ్మిది ఋణాలు మనిషి జీవితంలో ఎప్పుడూ ప్రభావితం చూపిస్తూ ఉంటాయి. ఈ రుణాలను తీర్చుకొనకపోతే ఆ వ్యక్తి మీద ఆ రుణ బాధల ప్రభావం చూపిస్తూ ఉంటాయి. ఎన్ని పూజలు, హోమాలు చేయించినా సరైన ఫలితాలు ఉండదు. ఎంత కష్టపడినా జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగలేక నిరాశ నిస్పృహలకు లోనౌవుతారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ రుణబాధలతో ఇబ్బందులు పడుతున్న వ్యక్తి యొక్క జాతక పరిశీలన చేసి ఏ రుణ బాధ అతనికి కష్టాలు కలుగచేస్తోందో గ్రహించాలి. దానితో పాటుగా గ్రహసంబంధ విషయాలను గురించాలి . గ్రహాలకు సంబంధించిన పరిహారాలను చేయటానికి ముందుగా ఈ తొమ్మిది రుణాలు నుంచి అతడిని విముక్తుడిని చేసే మార్గాలు సూచించి అతను పాటించే నియమాలు, విధి విధానాలు తెలుసుకుని ఆ తర్వాత ఆ గ్రహాలకు సంబంధించిన పరిహారాలను చేయించడం ద్వారా తగిన విధంగా ఫలితం ఉంటుంది.

పితృఋణం: మరణించిన తండ్రి, తల్లి లేక అందుకు సమానమైన రక్త సంబంధీకులు మరణించిన తరువాత ఏ వ్యక్తి అయినా వారికి తాను చేయాల్సిన కర్మలను చేయకపోవడం. ఆబ్దికం, సంవత్సరీక, తర్పణాలు విడవడం వంటివి శాస్త్రోక్తంగా కర్మలను నిర్వహించక పోవడం వల్ల ఆ వ్యక్తి వారికి రుణపడి ఉంటాడు. ఇందువల్ల విద్య, ఉద్యోగం, వ్యాపారంలో ఆటంకాలు, తీవ్ర నష్టాలు చూస్తారు. అకారణ శత్రువులు, అవమానాలు, నిందలు, కోర్టు వ్యవహారాలు, చెరసాల వంటి కష్టనష్టాలు పితృరుణం వల్ల కలుగుతాయి. ఇటువంటి సమస్యలు ఉన్న వారు ముందుగా పితృరుణం క్షయం చేయించుకోవాలి . ఆ తర్వాత మిగిలిన పరిహారాలు త్వరగా ఫలిస్తాయి.

మాతృరుణం: ఏ వ్యక్తి అయినా తెలిసీ , తెలియక తన తల్లికి కోపాన్ని, వేదనను కలిగించడం, ఆమెను తిట్టడం, కొట్టటం, ఆమెపట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం, ఒక బిడ్డకు తల్లిని దూరం చేయడం లేక కుటుంబానికి యజమానురాలిని దూరం చేయడం మాతృ శాపం గురిచేస్తుంది. దీని వలన విద్యలో ఆటంకాలు ఎదురవుతాయి. ధనం తీవ్రంగా నష్టపోతారు. గృహంలో మనఃశాంతి లోపిస్తుంది. భూ, పశు సంపద వివాదాలు మొదలైన నష్టాలు చవిచూస్తారు. ఇటువంటి సమస్యలు ఉన్న వారు ముందుగా మాతృరుణ శుద్ధి చేయించుకుని మిగిలిన పరిహారాలు ఆచరించాలి.

పుత్రికా ఋణం: స్త్రీ సంతానం పట్ల దురుసుగా ప్రవర్తించడం, వారిని అకారణంగా బాధించడం వలన వారికి వేడుకలు చేయకపోవడం వల్ల వారి నుంచి ధనం, వస్తువులను తీసుకుని తిరిగి ఇవ్వకపోవడం వల్ల పుత్రికా రుణం ఏర్పడుతుంది. కొంత మంది వారి పుత్రికలకు వారికి ఇవ్వవలసిన ఆస్తిని ఇవ్వకుండా మగ పిల్లలకి మాత్రమే ఇచ్చి పుత్రికలకు ఇవ్వకపోవడం వల్ల కూడా కలుగుతుంది. ఈ విధమైన రుణం వలన ఆ వ్యక్తికి భార్యతో విభేదాలు, సంతానంతో విభేదాలు కలగటంతో పాటు ధనం నష్టం, అవమానాలు, ఒక్కోసారి ఒంటరిగా జీవించడం లాంటి సమస్యలు వస్తాయి. ఇటువంటి సమస్యలు ఉన్న వారు ముందుగా పుత్రికారుణంతప్పకుండా తీర్చుకోవడం తప్పనిసరి.

స్త్రీ రుణం: భార్య, పర స్త్రీ, ప్రియురాలు, ఉంపుడుగత్తె విషయంలో కూడా చేసే దుర్మార్గం స్త్రీ రుణంగా పీడిస్తుంది. భార్యను కొట్టడం, తిట్టడం, ఆమె స్వార్జితాన్ని దొంగిలించడం, భయపెట్టి లాక్కోవడం, ఆమెను పస్తులుంచడం, మానరక్షణకు వస్త్రాలు సమకూర్చకపోవడం, కుటుంబ అవసరాలకు తగిన ధనం ఆమెకు ఇవ్వకపోవడం, ఆమెను ఇంట్లో నుంచి వెళ్ళగొట్టడం లేక వెళ్లిపోయేలా చేయడం, భార్యాభర్తలను లేని పోని అనుమానంతో, లేనిపోనివి సృష్టించి వారిని విడదీయడం, పరస్త్రీని కామించడం, ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, ఆమె మీద నిందలు ప్రచారం చేయడం, ఆమెను బలాత్కారం చేయడానికి సన్నాహాలు చేయడం , భయపెట్టడం , ఉంపుడుగత్తెగా ఉన్న స్త్రీ పట్ల నిర్దయగా ప్రవర్తించడం , అనుమానం తో వేధింపులు పెట్టడం , మానసికంగా శారీరకంగా హింసించడం ఇటువంటివి అన్ని స్త్రీ ఋణంగా పరిగణనలోకి వస్తాయి. ఈ ఋణం వలన ఆ వ్యక్తికి భార్యతో సఖ్యత ఉండదు. గృహ శాంతి ఉండదు. ఎప్పుడూ తిరుగుతూ ఉంటాడు దీనికి తొడు వ్యసనాలకు బానిస అవుతాడు. దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయి. మానసిక అశాంతిని పొందుతారు. దారిద్ర్యం తో పాటు శరీరం రోజురోజుకూ శుష్కించి పోవడం జరుగుతుంది. అశ్లీలం పట్ల అమితమైన ఆసక్తి పెరుగుతుంది. ఇటువంటి సమస్యలు ఉన్న వారు జీవితం లో ఒక్క పని కూడా ముందుకు రావడం జరుగదు. ఈ స్త్రీ రుణం తీర్చుకుంటే తప్ప వేరే మార్గం లేదు.

సోదర రుణం: తన రక్త సంబంధీకులతో అంటే తన సోదరులతో వివాదాలు పెట్టుకోవడం వారి స్వార్జితమైన ధనం తన అవసరాలకు వాడుకోవడం లేక వారికి చెందవలసిన ధన, కనక, వస్తు, వాహన, భూ, గృహ, లాంటి వాటిని తీసేసుకోవడం వల్ల సోదర రుణం ఏర్పడుతుంది. ఈ ఋణం కలిగిన వ్యక్తి దారిద్ర్యం పొందుతారు. తన జీవిత కాలం అంతా కష్టపడినా కూడా మనశాంతి పొందడు. అతని కుటుంబంలో భార్య లేక భార్య వైపు బంధువుల యొక్క ఆధిపత్యము అధికంగా ఉంటుంది. జీవితం చివరి దశకు వచ్చే సరికి హీనమైన, దీనస్థితి పొందుతారు.

దైవ రుణం: తెలిసి తెలియని దైవం పట్ల చేసే తప్పిదాలు ఈ దైవ రుణానికి కారణం అవుతాయి. ఈ రుణం పొందిన వ్యక్తులకు దైవం పట్ల నమ్మకం ఉండదు. కొన్ని సందర్భాల్లో ఇతరుల కోసం తానూ దైవాన్ని ఆశ్రయిస్తాడు కానీ దైవాన్ని మనసా వాచా కర్మణా ఆరాధించడు, అవకాశం కుదిరినప్పుడు వితండవాదం చేస్తారు ..వీరు ఎటువంటి పూజలు చేయించరు ఒక వేళ చేయించినా ఫలితం ఉండకపోగా వీరికి చేయించిన పౌరోహితుడు వీరితో అనేక ఇబ్బందులు పడతాడు. ఇక భ్రూణ హత్య, పుత్రుడిని చంపడం, పెంపుడు జంతువులను చంపడం , గోహత్య వంటి పంచమహాపాతకాలతో పాటు ఒక మరణానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణమైతే దైవ రుణం పాలవుతారు. వీరు సొంత మనుషులను కూడా హింసించడానికి వెనుకాడరు. ఈ రుణం వల్ల ప్రప్రథమంగా సంతాన హీనత కలుగుతుంది. లేక అంగవైకల్యంతో సంతానం కలుగుతుంది. ఆ సంతానంపై అనేక దుష్ప్రభావాలు ఉంటాయి. ఈ రుణం కలిగిన వ్యక్తికి అధికమైన కుటుంబ సమస్యలు ఉంటాయి. మానసిక అశాంతిని కలిగి ఉంటారు. వీరితో పాటు వీరి సన్నిహితులకు కూడా చెడు ఆలోచనలను చేసి ప్రభావితం చేస్తారు.

ఋషి రుణం: తమ వంశానికి మూలపురుషుడు ఋషిని సేవించలేకపోవడం , సాదు సన్యాసుల పట్ల తెలిసో తెలియకో అమర్యాదగా ప్రవర్తించడం, రుషిప్రోక్తమైన ఉపదేశాలను హేళన చేయడం వల్ల, తీసుకున్న మంత్రాన్ని సరిగా జపం చేయలేక అది ఇచ్చిన వారిని తక్కువ చూడటం, ఋషి రుణం కిందకు వస్తాయి. ఋషి రుణం ఉన్న వారిలో మూర□త్వం పెరిగిపోతుంది. ఆవేశం వల్ల అనేక కష్టనష్టాలను పాలవుతుంటారు. ఏం చేసినా కుటుంబ సౌఖ్యం లోపిస్తుంది. ఎప్పుడూ ఏదో ఒక విధంగా పరుల నోట్లో నానుతూ ఉంటాడు . ఇటువంటి వారు ఋషి రుణం తీర్చుకోవాలి.

దాన రుణం: ఒకరికి దానం చేస్తానని చెప్పి మాట ఇచ్చి చేయకపోవడం లేదా దానం చేసి ప్రతి ఫలం కోరటం, పనికి రాని దానం చేయడం, దానం చేసిన వానిని తిరిగి బలవంతంగా సొంతం చేసుకోవడం ఇవన్నీ దాన రుణం కలిగిస్తాయి. ఈ రుణం పొందిన వారు తరచుగా వివాదాలు పాలవుతారు. ధనం , కుటుంబ జీవనం నష్టపోయినపుడు, వ్యసనాల పాలు అవుతారు. దారిద్ర్యం , ఋణ బాధలు, బంధు , మిత్రుల నిరాదరణకు పొందటంతో పాటు అవమానాలు అపకీర్తిని భరించవలసి వస్తుంది.

గురు రుణం: గురువు లేదా అంతకు సమానమైన హితుల పట్ల చేసే అపచారం గురు రుణంగా బాధిస్తాయి. తరచు తగవులు, మిత్రులతో విభేదాలు, ఉపాధిని కోల్పోవడం, వివేకాన్ని కోల్పోయి సమాజంలో అపకీర్తిని భరించవలసి వస్తుంది.

- అలేఖ్య కట్కం

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com